
# చైతన్యం

**సంకల్ప బలం**

నవంబర్ 2024
రూ. 20/-






సౌత్ కొరియా పర్యటనలో తెలంగాణా మంత్రుల బృందం



బ్రిక్స్ సదస్సు 2024



వ్యవస్థాపక సంపాదకురాలు
తీగవరపు శాంతి

చైతన్యం
సంకల్ప బలం
సామాజిక విలువల మాస పత్రిక
నవంబర్ 2024
సంపుటి -14 సంచిక - 2

## ఈ సంచికలో....


| | |
|---|---|
| సంపాదకీయం | 4 |
| దీపావళి-దీపాలంకరణ | 7 |
| వార్తా విశేషాలు | 15 |
| మానవ జన్మ రహస్యం | 24 |
| అమెరికాలో విద్యా విధానం | 25 |
| బ్రహ్మ ఖండం | 28 |
| జ్యోతిర్లింగ యాత్ర | 30 |
| గెలుపు గుర్రాలు | 35 |
| సంభాషణ సంస్కృతం | 38 |
| కలియుగ ప్రత్యక్ష దైవం | 41 |
| తెలుగు సాహిత్య చరిత్ర | 43 |
| తృప్తి పడ్డ మనసు | 45 |
| వధూ వరుల అన్వేషణ వేదిక | 48 |
| గళ్ళ నుడికట్టు | 49 |


రచనలలోని అభిప్రాయాలు రచయితలవి మాత్రమే. పత్రిక యాజమాన్యానికి ఎటువంటి సంబంధమూ లేదు.

పాఠక దేవుళ్ళకు  నరక చతుర్దశి -- దీపావళి శుభాకాంక్షలు

దీపావళి పండుగ గొప్ప సాంస్కృతిక మరియు ఆధ్యాత్మిక ప్రాముఖ్యత కలిగిన ప్రధాన హిందూ పండుగ. ఇది చీకటిపై కాంతి, చెడుపై మంచి మరియు అజ్ఞానంపై జ్ఞానం యొక్క విజయాన్ని సూచిస్తుంది. దీపాల యొక్క కాంతి ఆధ్యాత్మిక చీకటి నుండి రక్షించే అంతర్గత కాంతిని సూచిస్తుంది.

నరక చతుర్దశి 30న, అమావాస్య తిథి అక్టోబర్ 31 ఉదయం 6. 22 గంటలకు ప్రారంభమై, నవంబర్ 1న ఉదయం 8. 46 గంటలకు ముగుస్తుంది. గోవర్ధన్ పూజ, అన్న కూట్ నవంబర్ 2 శనివారం, భాయ్ దూజ్,  యమ ద్వితీయ  నవంబర్ 3 ఆదివారం. ఈ విధంగా  దీపావళి పండుగ సాధారణంగా ఐదు రోజుల పాటు కొనసాగుతుంది.

దన్తేరస్: ధన్తేరస్ సందర్భంగా, ప్రజలు లక్ష్మీ దేవిని మరియు కుబేరుని పూజిస్తారు. ఇది కాకుండా, ఈ రోజున బంగారం, వెండి లేదా మరేదైనా లోహాన్ని కొనుగోలు చేసినట్లయితే అది కూడా శుభప్రదంగా పరిగణించబడుతుంది. ఆ వస్తువుని కూడా లక్ష్మిదేవి దగ్గర పెట్టి పూజిస్తారు .

చోటి దీపావళి లేదా నరక చతుర్దశి -  హిందూ పురాణాల ప్రకారం, ఈ రోజున శ్రీకృష్ణుడు నరకాసురుడితో యుద్ధం చేసి చంపాడని నమ్ముతారు. అందుకే ఆ రోజు  తల స్నానం చేసి, కొత్త బట్టలు కట్టుకుని, ఆ రోజు కూడా పండుగ జరుపుకుంటారు.

దీపావళి  - ఈ రోజున ప్రజలు తమ ఇంటిలో లక్ష్మీ పూజ చేస్తారు. ఈ రోజున, ప్రధాన దీపావళి పండుగ జరుగుతుంది, మరియు రావణుడిని చంపిన తరువాత, రాముడు అయోధ్యకు తిరిగి వెళ్ళాడు. ఆ రోజు సాయంత్రం గోంగూర కర్రలకు నూనెలో ముంచిన కొత్త గుడ్డ పీలికలు వెలిగించి "దిబ్బు దిబ్బు దీపావళి, మళ్ళీ వచ్చే నాగుల చవితికి ఎప్పుడు తిందాం చలివిడి ముద్ద" అంటూ  పిల్లల చేత పాటలు పాడించి,  దివిటీలు కొట్టిస్తారు. తరువాత వాళ్ళ కాళ్ళు, చేతులు కడిగి, కళ్ళు తుడిచి, వాళ్లకి స్వీట్ తినిపిస్తారు. ఇది మన సంప్రదాయం. తర్వాత   సంపద యొక్క దేవత లక్ష్మి. కావున లక్ష్మీదేవికి పూజ చేసి, ఇంట్లోను, బయట  దీపాలు వెలిగిస్తారు. తరువాత ఇంటి బయట నాలుగు దిక్కుల వైపు ( తూర్పు,పడమర,ఉత్తరం, దక్షిణం ) దీపాలు వెలిగించి ఉంచి, ఆ తరువాత మాత్రమే టపాకాయలు కాలుస్తారు.

ఆ మరుసటి రోజు పాడ్యమి రోజున కార్తీక మాస ప్రారంభం కావున, కార్తీక స్నానాలు మొదలవుతాయి. శివుడికి అభిషేకాలు. గోవర్ధన్ పూజ -  దీపావళి తర్వాత ఒక రోజు, ప్రజలు గోవర్ధన్ పూజను జరుపుకుంటారు, ఇది శ్రీకృష్ణుడిని ఆరాధించడానికి అంకితం చేయబడింది. ఇంద్రుడి నుండి మధుర పౌరులను రక్షించడానికి "గోవర్ధన్" అనే పర్వతాన్ని శ్రీకృష్ణుడు ఎత్తాడని ప్రజలు నమ్ముతారు.

భాయ్ దూజ్ -  భాయ్ దూజ్ రోజున, ప్రజలు సోదరులు మరియు సోదరీ మణుల మధ్య బలమైన బంధాన్ని జరుపుకుంటారు. రక్షా బంధన్ మాదిరిగానే, ఇది చంద్రమాన  క్యాలెండర్ యొక్క శుక్ల పక్షం యొక్క రెండవ రోజున జరుపబడుతుంది.

ముఖ్యంగా మనలో ఉన్న అజ్ఞానపు, అంధకార ఆలోచనలు పోయి, ప్రజలందరూ జ్ఞాన సముపార్జన పొందాలని ఆశిద్దాం.

## హైదరాబాద్ లో ఘనంగా సదర్ ఉత్సవాలు

హైదరాబాద్ లోని ఎన్టీఆర్ స్టేడియంలో ఆదివారం సదర్ ఉత్సవాలు ప్రారంభించారు  సీఎం రేవంత్ రెడ్డి. కాంగ్రెస్ నాయకులు, నటుడు రాహుల్ సిప్లిగంజ్, భారీ ఎత్తున ప్రజలు హాజరయ్యారు. ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ కోరిక మేరకు వేదికపై సీఎం రేవంత్ స్టెప్పులేశారు.

### బస్సు యజమానులుగా డ్వాక్రా మహిళలు --- భట్టి విక్రమార్క

మహిళాభివృద్ధిలో దేశానికి తెలంగాణ ఆదర్శమని, ఖమ్మం కలెక్టరేట్ లోని మహిళా శక్తి క్యాంటీన్ బస్సు షెల్టర్ ను ప్రారంభిస్తూ, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. వడ్డీ లేని రుణాలు ఇచ్చి మహిళలను వ్యాపార వేత్తలుగా తీర్చిదిద్దుతామని, వాళ్లకు రూ 25 వేల కోట్లు వడ్డీలేని రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. ఆ' ఆర్టీసీలో ద్వాక్రా సంఘాలను భాగస్వామ్యం చేయాలనీ, కొద్దీ రోజుల్లో డ్వాక్రా మహిళలు బస్సు యజమానులుగా మారతారని అన్నారు. అంతేకాదు వాళ్లకు వడ్డీ లేని రుణాలు ఇచ్చి, ఆర్టీసీ బస్సులు కొనుగోలు చేస్తామని, ఆ బస్సులు అద్దెకు ఇప్పిస్తామని మంత్రి భట్టి విక్రమార్క అన్నారు.

### మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు శంకుస్థాపనకు ముహూర్తం ఖరారు

మూసీ పునరజ్జేవ ప్రాజెక్టుపై ముందడుగు వేయడమే తప్ప వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఏదైనా నిర్ణయం తీసుకునే ముందే వెయ్యి సార్లు ఆలోచిస్తామని, తీసుకున్నాక వెనక్కి వెళ్ళేది లేదని, సచివాలయంలో మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. నవంబర్ 1న మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు ప్రకటించారు.

ఏపీ వార్తలు :

మంగళగిరి ఎయిమ్స్ లో డ్రోన్ సేవలను ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారు. ఢిల్లీ లోని ఏఐఐఏ నుండి వర్చువల్ గా ఆయన ఈసేవలను ఆవిష్కరించారు. అనంతరం ఎయిమ్స్ లో అధికారులు ప్రయోగాత్మకంగా డ్రోన్ పరీక్ష చేపట్టారు. ఎయిమ్స్ నుంచి నూతక్కి పీహెచ్ సీ వరకూ డ్రోన్ ను పంపించారు. ఓ మహిళా రోగి రక్త నమూనా ను సేకరించి, ఎయిమ్స్ కి అది తిరిగొచ్చింది. ఎయిమ్స్ నుంచి ఈ పీహెచ్ సీ దాదాపు 12 కి. మీ దూరంలో ఉంది. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు డ్రోన్ల ఉపయోగంపై ఈ ప్రయోగాన్ని నిర్వహించినట్లు అధికారులు తెలిపారు.

### ప్రజలకు 'ఉచిత ఇసుక' --- మంత్రి కొల్లు రవీంద్ర

ప్రజలకు ఉచితంగా ఇసుక అందించేందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేసాం. బోటు మెన్ అసోసియేషన్ ద్వారా ఇసుకను అందుబాటులోకి తీసుకొచ్చాం. సొంత వాహనాల్లో ఇసుకను తీసుకెళ్లేవారికి ఎలాంటి ఇబ్బందీ లేకుండా చూస్తున్నాం. రవాణా చార్జీలు, లోడింగ్ చార్జీలు చెల్లించి లారీల ద్వారా కూడా ఇసుకను తీసుకెళ్లేందుకు అనుమతించాం. రాష్ట్రంలో నిర్మాణ రంగం అభివృద్ధి బాటలో నడవాలి. అందుకు రాష్ట్రప్రభుత్వ పూర్తి సహకారం ఉంటుంది అని మంత్రి కొల్లు రవీంద్ర హామీ ఇచ్చారు.

జాతీయ వార్తలు :

### 70 ఏళ్ళు పైబడిన వారికందరికీ రూ 5 లక్షల వరకు ఆరోగ్య బీమా సౌకర్యం.

పేద, ధనిక తారతమ్యం లేకుండా దేశవ్యాప్తంగా ఉచిత ఆరోగ్య బీమా సదుపాయం అందుబాటులోకి వచ్చింది. 'ఆయుష్మాన్ భారత్ ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన'(PMJAY ) కింద తీసుకొచ్చిన ఈ సదుపాయాన్ని ప్రధాని నరేంద్ర మోడీ మంగళవారం ప్రారంభించారు. ధన్వంతరి జయంతి, తొమ్మిదో ఆయుర్వేద డే సందర్భంగా ఈ పథకానికి ప్రధాని మోడీ శ్రీకారం చుట్టారు. దేశ వ్యాప్తంగా ఆరు కోట్ల మంది సీనియర్ సిటిజన్లకు ఈ పథకం ద్వారా లబ్ది చేకూరుతుందని అంచనా. ఆయుష్మాన్ కార్డు ఉన్న వృద్ధులు కుటుంబ ప్రాతిపదికన ఏటా రూ 5 లక్షల వరకు లబ్ది పొందుతారు. అన్ని సామాజిక వర్గాలకు చెందిన వృద్ధులకు వైద్య భీమా లభిస్తుంది.

### తిహార్ జైలు వార్డెన్ కనుసన్నల్లో మాదక ద్రవ్యాల తయారీ ఫ్యాక్టరీ

నిషేధిత మాదక ద్రవ్యం మెథామ్ పెటమైన్ (మెథ్ ) తయారీ ల్యాబ్ ను దిల్లీ ఎన్సీఆర్ పరిధిలో ఎన్సీబీ

అధికారులు గుర్తించారు. దీని నిర్వహణ వెనుక ఏకంగా తిహాడ్ జైలు వార్డెన్ హస్తం కూడా ఉందని తెలి- సికొని నిర్ఘాంతపోయారు. గ్రేటర్ నోయిడా పరిధిలో ఎన్సీబీ అక్టోబర్ 25న దాడులు నిర్వహించింది. ఒక ఇంట్లో నిర్వహిస్తున్న మెథ్ ల్యాబ్ ను గుర్తించింది. ఇక్కడ దేశీయ వినియోగానికి, అంతర్జాతీయ ఎగుమ- తుల కోసం సింథటిక్ డ్రగ్స్ ను తాయారు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఘన, ద్రవ రూపాల్లో ఉన్న దాదాపు 95 కిలోల మెథ్ ను వారు స్వాధీనం చేసుకున్నారు.

నవంబర్ 5న అమెరికాలో అధ్యక్ష ఎన్నికలు

నేను నాజీని కాదు .. నాజీకి వ్యతిరేకిని --- డొనాల్డ్ ట్రంప్

నవంబర్ 5న అమెరికాలో అధ్యక్ష ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో రిపబ్లికన్ అభ్యర్థిగా డోనాల్డ్ ట్రంప్, డెమోక్రటిక్ అభ్యర్థిగా కమలహరిస్ లు బరిలో ఉన్నారు. ఈ నేపథ్యంలో మాజీ అధ్యక్షుడు ట్రంప్ హిట్లర్ ను పొగడటంపై డెమోక్రాట్ల నుంచి వెల్లువెత్తుతున్న విమర్శలపై ఆయన స్పందించారు. ఈ సందర్భంగా నేను నాజీని కాదు అని ట్రంప్ వ్యాఖ్యానించారు. నాజీకి నేను పూర్తి వ్యతిరేకిని. హారిస్ కు ఓటు వేయని ప్రతి ఒక్కరూ ఆమెకు నాజీలే అని ట్రంప్ పేర్కొన్నారు .

అంతరిక్ష కేంద్రం నుంచి శుభాకాంక్షలు --- శ్వేతసౌధంలో దీపావళి

అమెరికా అధ్యక్ష భవనంలో దీపావళి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి జొబైడెన్ హాజరయ్యారు. తన కార్యవర్గం విభిన్నమైన జాతులతో అమెరికాను ప్రతిబింబిస్తుందని అమెరికా అధ్య- క్షుడు జొబైడెన్ వ్యాఖ్యానించారు. అమెరికా అధ్యక్ష కార్యాలయాలైన శ్వేతసౌధంలో దీపావళి వేడుకల సందర్భంగా, అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం నుంచి వ్యోమగామి సునీతా విలియమ్స్ ప్రత్యేక సందేశాన్ని పంపారు. భారతీయ అమెరికన్ యూత్ యాక్టివిస్ట్ సుశృతి అమూల, అమెరికా సర్జన్ జనరల్ వివేక్ హెచ్ మూర్తి తదితరులు ప్రసంగించారు. అమెరికన్ల జీవితాల్లో ప్రతి భాగాన్ని వారు సుసంపన్నం చేశారు.

నివాస భవనంపై ఇజ్రాయిల్ దాడి --- 55 మంది మృతి

ఇజ్రాయిల్ దళాలు గాజాపై మరోసారి విరుచుకుపడ్డాయి. నివాసభావనంపై దాడి చేయడంతో 55మంది పాలస్తీనియన్స్ మృతిచెందారు. ఇజ్రాయిల్ -- హమాస్ ల మధ్య యుద్ధం నేపథ్యంలో పశ్చి- మాసియా అట్టుడిగి, గాజాపై ఇజ్రాయెల్ దాడులు కొనసాగిస్తూనే ఉన్నాయి. శిధిలాల కింద చిక్కుకు- ని చాలా మంది గాయపడ్డారని పేర్కొంది. ఇజ్రాయెల్ దాడులతో సుమారు లక్ష మంది పాలస్తీనియన్లు సరైన ఆహారం, వైద్య సదుపాయాలూ లేక అలమటిస్తున్నారని పాలస్థీనియన్ సివిల్ ఎమెర్జెన్సీ సర్వీసెస్ పేర్కొంది. గాజాలోని ఆసుపత్రుల్లో వైద్య సామాగ్రి, మానవ వనరుల కొరత అధికంగా ఉందని అక్కడి ఆరోగ్య శాఖ వెల్లడించింది. ఒప్పందం కుదిరితే ఆపేస్తామని హమాస్ వెల్లడించాయి. ఓ వైపు ఒప్పందం దిశగా అడుగులు పడుతున్నా ... దాడులు మాత్రం తగ్గక పోవడం ఆందోళన కరంగా ఉంది.

డిసెంబర్ 9 తెలంగాణకు పండుగ రోజు ---- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



తెలంగాణ ఆకాంక్ష నెరవేరిన రోజు. డిసెంబర్ 9 సోనియాగాంధీ జన్మ దినం. డిసెంబర్ నెలంతా తెలంగాణలో పండుగ వాతావరణం నెలకొంటుంది.

పాఠకులంతా దీపావళిని ఆనందంగా జరుపుకుని, నవంబర్ నెలంతా కార్తీక మాస వ్రతాన్ని ఆచరించి, భక్తి పారవశ్యంలో ప్రజలంతా ఉండాలని, ప్రతి ఒక్కరూ సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకుంటోంది మీ చైతన్యం సంకల్పబలం .

## సర్వేజనా సుఖినోభవంతు

తీగవరపు శాంతి

# దీపావళి - దీపాలంకరణ

దీపం జ్యోతిః పరంబ్రహ్మ దీపం సర్వతమోపహమ్ |
దీపేన సాధ్యతే సర్వమ్ సంధ్యా దీప నమో   స్తుతే ||



భారతీయ సంస్కృతికి ప్రతిబింబంగా వెలుగొందేవి భారతీయ పండుగలలో దీపావళి ఒకటి . ఆనంద ఉత్సాహాలతో జాతి, కుల, మత, వర్గ విభేదాలను విస్మరించి సమైక్యంగా జరుపుకునే పండుగే దివ్య దీపుల దీపావళి. జగతిని జాగృతం చేసే చైతన్య దీపుల శోభావళి. నరకాసురుడనే రాక్షసుడిని సంహరించిన మరుసటి రోజు అతడి పీడ వదిలిన ఆనందంలో ప్రజలు దీపావళి చేసుకుంటారని పురాణాలు చెబుతున్నాయి. అలాగే లంకలోని రావణుడిని సంహరించి శ్రీరాముడు సతీసమేతంగా అయోధ్యకు తిరిగి వచ్చినపుడు కూడా ప్రజలు ఆనందోత్సవాల మధ్య దీపావళిని జరుపుకున్నారని రామాయణం చెపుతోంది. చీకటిని పారద్రోలుతూ వెలుగులు తెచ్చే పండుగగా, విజయానికి ప్రతీకగా దీపావళి పండుగను జరుపుకుంటారు. దీప మాలికల శోభతో వెలుగొందే గృహం గణాలు, ఆనంద కోలాహలంతో వెల్లివిరిసే ఆబాల గోపాలం, నూతన వస్త్రాల రెపరెపలు, పిండి వంటల ఘుమఘుమలు, బాణసంచా చప్పుళ్ళు, ఈ దివ్య దీపావళి సోయగాలు. ఈ పండుగ ప్రతి యేటా ఆశ్వయుజ అమావాస్య రోజున వస్తుంది. దీపాల పండుగకు ముందు రోజు ఆశ్వయుజ బహుళ చతుర్దశి. దీన్ని నరక చతుర్దశిగా జరుపుకుంటారు.

నరక చతుర్దశి:



ఆశ్వయుజ బహుళ చతుర్దశి నరక చతుర్దశిగా ప్రసిద్ధి పొందింది. నరకాసురుడు అనే రాక్షసుడు చెలరేగి సాధు జనాలను పీడిస్తూ దేవ, మర్త్య లోకాలలో సంక్షోభాన్ని కలిగిస్తుంటాడు. కృతయుగంలో హిరన్యాక్షున్ని వధించిన వరాహస్వామి కి, భూదేవికి అసుర సంధ్యా సమయంలో జన్మిస్తాడు నరకుడు. అతడు లోక కంటకుడైనా మహావిష్ణువు వధించరాదని, తల్లియైన తన చేతిలోనే మరణించేలా వరం పొందుతుంది భూదేవి. మహావిష్ణువు ద్వాపరయుగంలో శ్రీకృష్ణ భగవానునిగా అవతరించినప్పుడు భూదేవి సత్యభామగా జన్మిస్తుంది.

అప్పటికి నరకాసురుడు లోక కంటకుడై చేస్తున్న అధర్మకృత్యాలను అరికట్టడానికి సత్యభామా సమేతంగా తరలి వెళ్తాడు శ్రీకృష్ణుడు. వారి మధ్యజరిగిన భీకర సంగ్రామంలో భూదేవి అంశ అయిన సత్యభామ నరకాసురుని శరఘాతాలకు అంతమొందిస్తారు . మరణిస్తాడు నరకుడు. తన పుత్రుని పేరైనా కలకాలం నిలిచి ఉండేలా చేయమని సత్యభామ ప్రార్థించడంతో ఆ రోజు నరక చతుర్ధశిగా పిలువబడుతుందని వరం ప్రసాదిస్తాడు శ్రీకృష్ణుడు. నరకుని చెరనుండి సాధుజనులు,' పదహారువేలమంది రాజకన్యలు విడిపించబడ్డారు. ధర్మం సుప్రతిష్ఠమైంది.

నరకాసురుని పీడ విరగడైందన్న సంతోషంతో ఆ మరుసటి రోజు ప్రజలు సంబరాలు జరుపుకుంటారు. ఈ సంబరాలు జరుపుకునే రోజు అమవాస్య కావడంతో, చీకటిని పారద్రోలుతూ ప్రజల దీపాలతో తోరణాలు వెలిగించి, బాణాసంచా కాల్చి వేడుక చేసుకున్నారు. కాలక్రమంలో అదే దీపావళి పర్వదినంగా మారింది. దీపజ్యోతిని పరబ్రహ్మ స్వరూపంగా, మనోవికాసానికి, ఆనందానికి, నవ్వులకు, సజ్జనత్వానికి, సద్గుణ సంపత్తికి నిదర్శనంగా భావిస్తారు. మహిళామణులంతా ఆశ్వీయుజ బహుళ చతుర్దశి నుండి కార్తీక మాసమంతా సంధ్యా సమయంలో మట్టి ప్రమిదలలొ దీపాలను వెలిగిస్తారు. చివరకు ఈ దీపాలను ముత్తయిదువులు కార్తీక పౌర్ణమికి సముద్ర స్నానాలను ఆచరించి జీవనదులలో వదులుతారు. ఇవి సౌభాగ్యానికి, సౌశీల్యానికి, సౌజన్యానికి ప్రతీకలుగా భావిస్తారు. పైగా ఈ దీపావళి శరదృతువులో అరుదెంచటం విశేషం. మనోనిశ్చలతకు, సుఖశాంతులకు అనువైన కాలమిది.దీపాలపండుగ అయిన దీపావళి రోజున మహాలక్ష్మీ పూజను జరుపుకోవడానికి ఓ విశిష్టత ఉంది. పూర్వం దుర్వాస మహర్షి ఒకమారు దేవేంద్రుని ఆతిథ్యానికి సంతసించి, ఒక మహిమాన్వితమైన హారాన్ని ప్రసాదించాడు. ఇంద్రుడు దానిని తిరస్కార భావముతో తన వద్దనున్న ఐరావతం అను ఏనుగు మెడలో వేస్తాడు అది ఆ హారాన్ని కాలితో తొక్కివేస్తుంది. అది చూచిన దుర్వాసనుడు ఆగ్రహము చెంది దేవేంద్రుని శపిస్తాడు. తత్ఫలితంగా దేవేం-

ద్రుడు రాజ్యమును కోల్పోయి, సర్వసంపదలు పోగొట్టుకుని దిక్కుతోచక శ్రీహరిని ప్రార్థిస్తా-డు. ఈ పరిస్థితిని గమనించిన శ్రీ మహావిష్ణువు దేవేంద్రుని ఒక జ్యోతిని వెలిగించి దానిని శ్రీ మహాలక్ష్మీ స్వరూపంగా తలచి పూజించమని సూ-చిస్తాడు. దానికి తృప్తిచెందిన లక్ష్మీదేవి అనుగ్రహంతో తిరిగి త్రిలోకాధిపత్యాన్ని, సర్వసంప-దలను పొందాడని పురాణాలు చెబుతున్నాయి.



ఆ సమయంలో శ్రీ మహావి-ష్ణువు చెంతనే ఉండే మహా-లక్ష్మీదేవిని ఇంద్రుడు ఇలా ప్రశ్నించాడు. తల్లి నీవు కేవలం శ్రీహరి వద్దనే ఉండటం న్యాయమా? నీ భక్తు-లను కరుణించవా? అంటాడు. దీనికి ఆ మాత సమాధానమిస్తూ.. త్రిలోకాధిపతీ.."నన్ను త్రికరణ శుద్ధిగా ఆరాధించే భక్తులకు వారి వారి అభీష్టాలకు అనుగుణంగా మహర్షులకు మోక్షలక్ష్మీ రూపంగా, విజయాన్ని కోరేవారికి విజయలక్ష్మీగా, విద్యార్థులు నన్ను ఆరాధిస్తే విద్యాలక్ష్మీగా, ఐశ్వర్యాన్ని కోరి ఆరాధించేవారి-కి ధనలక్ష్మీగా, వారి సమస్త కోరికలు నెరవేర్చే వరలక్ష్మీదేవిగా ప్రసన్నురాలౌతానని" సమాధానమిచ్చింది. అందుచేత దీపావళి రోజున మహాలక్ష్మిని పూజించేవారికి సర్వసంపదలు చేకూరుతాయని విశ్వాసం.[1]

దీపావళి రోజు పండుగ జరుపుకునే విధానం : అంధ తమిస్రంచ దక్షిణాయన మేవచ

ఉత్తరాయణే తస్మా జ్యోతిర్దానం ప్రశస్యతే

అంధ తమ్సమనేది ఒక నరకం, దక్షిణాయన పాపకాలం నుండి తప్పించుకొని తరించడానికి ఉత్త-రాయణ పుణ్యకాలంలో జ్యోతిని దానం చేయుట ఉత్తమోత్తమమైన కార్యంగా భావిస్తారు హైందవులు. ఆశ్వయుజ మాసంలో వచ్చే బహుళ చతుర్దశి, అమావాస్యలు పరమ పవిత్ర పర్వదినాలు. భక్తి విశ్వాసాల-తో, ఆనందోత్సాహాలతో దేశమంతటా పిల్లలూ, పెద్దలూ అందరూ కలసి జరుపుకునే పండుగ రోజులివి.

దివ్వి దివ్వి దీపావళి మళ్ళీ వచ్చే నాగులచవితి అంటూ చిన్న పిల్లలంతా గోగునార కట్టలకి కొత్తవి చిన్న చిన్న గుడ్డ ముక్కల్నినూనెలో ముంచి , కట్టి వెలిగించి దిష్టి తీయడాన్ని మనం సంప్రదాయంగా కొన్ని ప్రాంతాలల్లో చూస్తూంటాం. . సాయంత్రం ప్రదోష సమయంలో దీపాలు వెలిగించి, ముందుగా పిల్లలు దక్షిణ దిశగా నిలబడి దీపం వెలిగించడాన్ని ఉల్కాదానం అంటారు. ఈ దీపం పితృదేవతలకు దారి చూ-పుతుందని శాస్త్రాలు చెబుతున్నాయి. ఆ దీపం వెలిగించిన తరువాత కాళ్ళు కడుక్కుని ఇంటిలోపలకు వచ్చి తీపి పదార్థం తింటారు. అటు తరువాత పూజాగృహంలో నువ్వులనూనెతో ప్రమిదలు వెలిగించి దీపలక్ష్మికి నమస్కరించి కలశంపై లక్ష్మీదేవిని అవాహన చేసి విధివిధానంగా పూజిస్తారు. పూజానంతరం అందరూ ఉత్సాహంగా బాణాసంచా కాల్చడానికి సంసిద్ధులౌతారు. చిచ్చుబుడ్లు, విష్ణుచక్రాలు, భూచ-క్రాలు, మతాబులు, కాకరపువ్వొత్తులు, కళ్ళు మిరుమిట్లుగొలుపుతుంటే మరో ప్రక్క సీమటపాకాయల ఢమఢమ ధ్వనులతో మ్రోగుతుంటాయి పరిసరాలన్నీ. ఈ విధంగా బాణాసంచా కాల్చడానికి ఒక ప్రయో-జనం చెప్పబడింది పురాణాలలో, ఆ వెలుగులో, శబ్దతరంగాలలో దారిద్ర్య దు:ఖాలు దూరంగా తరిమి

వేయుబడి లక్ష్మీకటాక్షం సిద్ధి-
స్తుందని, అంతేకాక వర్షఋ-
తువులో ఏర్పడిన తేమవల్ల
పుట్టుకువచ్చే క్రిమి కీటకాలు
బాణాసంచా పొగలకి నశిస్తాయి.
అసుర నాశనానికి, ధర్మ ప్రతిష్ఠా-
పనకు గుర్తుగా అమావాస్యనాడు
జరుపుకునే దీపావళి పం-
డుగనాడు లక్ష్మీదేవికి ప్రతీకగా
వెలుగులు విరజిమ్మే దీపలక్ష్మిని
పూజించడం సర్వశుభాలు ప్ర-
సాదిస్తుంది.



దీపావళి చుట్టూ అనేకానేక
కథలు ఉన్నాయి. శ్రీకృష్ణుడు
సత్యభామ సహకారంతో నరకా-
సురుణ్ణీ వధించాడు గనుక ప్రజలు ఆనందంతో మరునాడు దీపావళి సంబరం చేసుకుంటారని ఒక కథ. ఇంకో కథకూడా ఉంది. లంకలో రావణుని సంహరించి, రాముడు సీతాసమేతంగా అయోధ్యకు తిరిగి వచ్చినప్పుడు ప్రజలు ఆనందంతో ఈ పండుగ జరుపుకున్నారని చెబుతారు. ఉత్తరాదివారు ముఖ్యంగా వ్యాపారులు దీపావళి రోజును కొత్త సంవత్సరంగా పాటిస్తారు. ఆ రోజు లక్ష్మీదేవి పూజచేసి కొత్త ఖాతా పుస్త-కాలు తెరుస్తారు. దీపావళి పండుగల్లాంటివే ప్రపంచంలోని అన్ని సమాజాల్లోనూ ఉన్నాయి.

భగినీ హస్త భోజనం

దీపావళి కొన్ని ప్రాంతాల్లో అయిదు రోజుల పండుగగా జరుపుకుంటారు. ఆశ్వయుజ బహుళ త్రయోద-శితో ప్రారంభమైన దీపావళి వేడుకలు, కార్తీక శుద్ధ విదియ భగినీహస్త భోజనంతో ముగుస్తాయి.దీపావళి అయిన రెండో రోజు చేసుకుంటారు.భారతదేశంతో పాటు నేపాల్‌లో కూడా జరుపుకొంటారు.ఈ రోజును పుష్ప ద్వితీయ, యమ ద్వితీయ, కాంతి ద్వితీయ, వంటి అనేక పేర్లతో పిలుస్తారు.భయ్యా ధూజీ అనే పేరుతో ఉత్తరదేశంలో బాగా ప్రాచుర్యం పొందిన భగినీ హస్త భోజనం సోదరుని క్షేమానికి సంబంధించిన-ది.

భగినీహస్త భోజనం : భగినీ హస్త భోజనం అంటే ఏమిటి? అలా ఎందుకు చేయాలి?

త్రిశూలంతో యమధర్మరాజు నే పరుగెత్తించిన పరమశివుడు .. భగినీ హస్త భోజనం వెనుక ఆసక్తికర కథ:

ఐదు రోజుల పండుగ దీపావళి పండుగలో ఆసక్తికరమైన పండుగ 'భగినీ హస్త భోజనం'. అన్నాచెల్లె-ళ్లు, అక్కా తమ్ముళ్ల పండుగ అంటే గుర్తుకొచ్చేది రక్షా బంధన్ పండుగ. అంతటి ప్రాముఖ్యత కలిగినది కార్తీకమాసంలో వచ్చే దీపావళి పండుగలో భాగమైన భగినీ హస్త భోజనం పండుగ. దీనికి పండుగ అని ఎందుకు అంటామంటే..అన్న చెల్లెలి ఇంటికి వచ్చిన అనుబంధాలకు ప్రతీక కాబట్టి. తన వివాహం అయ్యాక తనను చూడటానికి రాని అన్న..తను ఎంతగా కోరినా తనను చూడటానికి రాని అన్న అనుకో-కుండా వస్తే ఆ సోదరి ఎంత ఆనందపడుతుందో ఈ 'భగినీ హస్త భోజనం'. వేడుకలో ప్రతిబింబిస్తుంది. కార్తీక శుద్ధ విదియ అంటే దీపావళి వెళ్ళిన రెండవ రోజు ఈ వేడుకను జరుపుకుంటారు.

ధన త్రయోదశి రోజు మృత్యు దోషం తొలగించే యమ దీపం వెనుక ఆసక్తికరమైన కథ :



యమధర్మరాజు చెల్లెలు యమున. తనకు వివాహం అయి అత్తవారింటికి వెళ్లాక తన ఇంటికి అన్న తన ఇంటికి భోజనానికి ఆహ్వానిస్తుంది. కానీ సమవర్తి అయిన యుముడికి తన విధుల నిర్వహణలో తీరిక లేక చెల్లెలు ఇంటికి వెళ్లలేకపోయాడు. ఈక్ర-మంలో మార్కండేయుడి ప్రా-ణాన్ని తీయటానికి యముడు తన యమపాశంతో వెళ్తాడు. కానీ శివభక్తుడైన మార్కండేయుడు మహాశివుణ్ని శరణు వేడుకుంటాడు. లింగాన్ని ఆలింగనం చేసుకుని తన ప్రాణాలు కాపాడాలని వేడుకుంటాడు. అసలే భోళా శంకరుడు. భక్తుడు పిలిస్తే కాకుండా ఉండగ-లడా.. అంతే మార్కండేయుడు ప్రాణాలు తీయటానికి వెళ్లిన యముడ్ని అడ్డగించేందుక తన త్రిశూలా-న్ని తీసుకుని వెళతాడు. మార్కండేయుడు తన భక్తుడు. అని ప్రాణాలు తీయవద్దని యముడికి శివుడు చెబుతాడు. కానీ నేను తనకు అందరు సమానమే..అందుకే తనకు సమవర్తి అనే పేరు వచ్చింది..పేదా గొప్పా..భక్తుడా..? నాస్తికుడా అనే తేడా తనకు తెలియదు ఏ భక్తుడైనా తన విధి నిర్వహణలో పక్షపాతానికి తావులేదు..అర్థాయుష్కుడైన మార్కండేయుడు ప్రాణాల్ని తీస్తాను అని స్పష్టం చేస్తాడు.

దీంతో లయ కారకుడ్ని నా మాటనే ఎదిరిస్తావా... అంటూ శివుడు యముడిపై ఆగ్రహం వ్యక్తం చేస్తాడు. అయినా యముడు మార్కండేయుడు ప్రాణాలు తీసేందుకు తన పాశాన్ని విసురుతాడు. ఆ పాశానికి.. మార్కండేయుడికి మధ్యతో శివుడు తన త్రిశూలాన్ని అడ్డంగా పెడతాడు. దీంతో యముడు తన విధిని నిజాయితీగా నిర్వహించనీయకుడా తనను అడ్డుగా రావటం సరికాదని శివుడిని అంటాడు.దీంతో శివుడు ఆగ్రహం వ్యక్తం చేస్తు తన త్రిశూలాన్ని యుముడిపై విసరబోతాడు.త్రిశూలం శక్తి ఎంతటిదో తెలిసిన యముడు దాని ధాటి నుంచి తప్పించుకోవటానికి పరుగెత్తుతాడు. దీంతో త్రిశూలం పట్టుకుని శివుడు యుముడ్ని వెంటాడతా.

శివుడు త్రిశూలంతో వెంటపడటంతో..యముడు అలా పరుగెత్తుకుంటు వెళ్లి అనుకోకుండా తన చెల్లెలి యమున ఇంటికి వెళ్లి తలదాచుకుంటాడు. అన్న ఇన్నాళ్లకు వచ్చాడన్న ఆనందంతో సోదరి సంతోషంతో అన్నా ఎన్నాళ్లికి నామీద దయ కలిగింది అంటూ అతనికి సకల మర్యాదలు చేస్తుంది. దీంతో యముడు చెల్లెల్ని చూసి ఆనందపడుతు శివుడు వెంటరావటం గురించి మర్చిపోతాడు. చెల్లెలు చూపించే ఆదరా-ణకి పరవశించిపోతాడు. చెల్లెలు ప్రేమగా రుచికరమైన పిండివంటలతో విందు వడ్డిస్తుంటుంటే పరవ-శించిపోతాడు. అలా అన్నకు ఇష్టమైన భోజనం వడ్డిస్తుంది యమున. దీంతో ఆ అన్నా చెల్లెళ్ల బంధాన్ని.. అనుబంధాన్ని చూసిన శివుడు భోజనం చేసేవారిని సంహరించరాదని తిరిగి వెళ్లిపోతాడు. దీంతో అటు భక్త మార్కండేయుడి ప్రాణ సంరక్షణ జరిగింది..ఇటు ఎన్నాళ్లగానే అన్న కోసం ఆశగా ఎదురు చూసిన చెల్లెలు కోరిక నెరవేరింది. అన్నకు తృప్తికరంగా భోజనం పెట్టాలన్న యమున చిరకాల వాంఛ నెరవేరు-



తుంది.

లక్ష్మీపూజలో సకల శుభాలు కలిగించే దక్షిణావర్తి శంఖం విశిష్టత -- శంఖం ప్రాముఖ్యత :

శివుడి ఆగ్రహానికి గురి కాకుండా తనకు రక్షణనూ కల్పించిన చెల్లెలి అతిథి మర్యాదలకు యముడు ముగ్ధుడవుతాడు. చెల్లెల్ని నీకిష్టమైన ఏదైనా వరం కోరుకొమ్మా..తీరుస్తాను అంటాడు. దాంతో ఆమె ఈ రోజున చెల్లెలి ఇంటికి వెళ్లి, ఆమె చేతి వంట తినే సోదరుడికి నరకలోక వాసం లేదా అపమృత్యు దోషం కలగకుండా ఉండేలాగా..ఆ సోదరికి సౌభాగ్యాలు కలిగేలా దీవించమని కోరుతుంది. చెల్లెలి కోరిక విన్న యముడు పరమానంద భరితుడవుతాడు. తథాస్తు అంటాడు.

అలా ప్రతీ ఏటా కార్తీక శుద్ధ విదియనాడు ఇంటికి వచ్చి, ఆమె చేతి వంట తింటానని వరం ప్రసాదిస్తాడు. ఇదే రోజున తన సోదరి ఇంట ఏ సోదరుడు భోజనం చేస్తాడో అతడికి ఎటువంటి భయమూ ఉండదంటూ యముడు అనుగ్రహిస్తాడు. 'నీవు కోరిన విధంగా వరమిస్తున్నాను. అంతేకాదు, సోదరుడికి ఈరోజున తన చేతితో వండి వడ్డించే స్త్రీ సౌభాగ్యవతి అవుతుంది' అని చెల్లెలి ప్రేమపూర్వకమైన వీడ్కోలు తీసుకుని యముడు తిరిగి వెళ్తాడు.

అలాగే యమునకు, యముడికి గల ఈ అపురూప అనురాగ బంధమే 'యమ ద్వితీయ' పేరుతో అద్వితీయ పర్వదినంగా పేరు పొందింది అని పురాణగాథలు చెబుతున్నాయి. సోదరి చేతి వంట కాబట్టి 'భగినీ హస్తభోజనం'గా మారింది. తోబుట్టువు ఇంట్లో భోజనం చేసినప్పుడు-సోదరుడు ఆమెకు చీర, పసుపు, కుంకుమ, పూలు, పండ్లు, ఇతర కానుకలిచ్చే సంప్రదాయం ఉంది.

కాగా..యాంత్రికంగా మారిపోయిన ఈ కాలంలో అన్ని బంధాలు సన్నగిల్లుతున్నాయి. కుటుంబ సభ్యుల మధ్య పరస్పర అవగాహన, సంబంధ బాంధవ్యాలు క్రమక్రమంగా తగ్గిపోతున్నాయి. వాటిని తిరిగి నెలకొల్పడానికి, పునరుద్ధరణ ద్వారా భారతీయ కుటుంబ వ్యవస్థ వెలుగొందేలా చేయడానికి ఇటువంటి పండుగలు దోహదపడతాయి. సాధారణంగా హిందు పండుగల్లో ఇటువంటి విశేషాలు దాగుంటాయి. ఆరోగ్య రహస్యాలు దాగుంటాయి. ఇవి కేవలం పండుగలే కాదు బంధాలను..అనుబంధాలను పెంపొందించేవి అని చెప్పుకుని తీరాలి.

కాగా..ఈ భగిని హస్త భోజనం వేడుకను భారతదేశంతో పాటు నేపాల్‌లో కూడా జరుపుకొంటారు. ఈ

రోజును పుష్ప ద్వితీయ, యమ ద్వితీయ, కాంతి ద్వితీయ, వంటి అనేక పేర్లతో పిలుస్తారు. భయ్యా ధూజీ అనే పేరుతో ఉత్తరదేశంలో బాగా ప్రాచుర్యం పొందిన భగినీ హస్త భోజనం పండుగ. సోదరుని క్షేమం.. సోదరీ మణి సౌభాగ్యానికి సంబంధించినదీ పండుగ.




కార్తీక పౌర్ణమి విశిష్టత

కార్తీక మాసంలో వచ్చే పౌర్ణమిని హిందువులకు పరమ పవిత్రమైన రోజు. ఇది మహా శివరాత్రితో సమానమైన పుణ్యదినం. ఈ పర్వదినాన్ని "త్రిపురి పూర్ణిమ", "దేవ దీపావళి" అని కూడా అంటారు. ఆశ్వయుజ అమావాస్య అంటే దీపావళి వెళ్ళిన మర్నాడు కార్తీకమాసం ప్రారంభమౌతుంది. ఇక ఆరోజు నుండి కార్తీకమాసం ముగిసేవరకూ ప్రతిరోజూ సాయంవేళ దీపాలు వెలిగించి సంరంభం చేస్తారు. ముఖ్యంగా కార్తీక సోమవారాలు, కార్తీక పౌర్ణమి పర్వదినాల్లో విశేష పూజలు నిర్వహిస్తారు. ఈ నెల అంతా కార్తీక మహా పూరాణాన్ని పారాయణం చేస్తారు. దేవాలయాల్లో కార్తీక పురాణ శ్రవణం ఏర్పాటు చేస్తారు.

మహాభారత కథనాన్ని అనుసరించి కార్తికేయుడు తారకాసురుని సంహరించిన రోజే కార్తీక పౌర్ణమి. ప్రజలను నానారకాలుగా హింసిస్తున్న తారకాసురుడు ఇక లేడన్న ఆనందంతో దీపాలు వెలిగించి సంబరం చేసుకున్నారు. వెయ్యేళ్ళ రాక్షసుల పాలన అంతరించిన శుభసందర్భంగా మహాశివుడు తాండవం చేశాడని పురాణాలు చెప్తున్నాయి.

కార్తీక పౌర్ణమి అటు శివునికి, ఇటు విష్ణుమూర్తికి కూడా ప్రియమైన రోజు. ఈరోజున దీపం వెలిగిస్తే మనం తెలిసీ తెలీక చేసే పాపాలన్నీ హరించుకుపోతాయి. కార్తీక సోమవారాల్లో, కార్తీక పౌర్ణమి రోజున రుద్రాభిషేకం చేయిస్తారు. ఈ విశిష్ట దినాన సత్యన్నారాయణ వ్రతం చేసుకోవడం చాలా శ్రేష్ఠం. ప్రధానంగా కార్తీక పౌర్ణమి నాడు తెల్లవారు జామున సముద్రంలో లేదా నదిలో స్నానం చేయడం శుభప్రదం.

నదిలో స్నానం చేసే అవకాశం లేనివారు ఉదయానే లేచి స్నాన జపాలు ముగించి ఆలయానికి వెళ్ళి దేవుని దర్శించుకుంటారు. ప్రత్యేక పూజల్లో పాల్గొంటారు.

రోజంతా ఉపవాసం ఉండి, సాయంత్రం 365 వత్తులతో కూడిన దీపాన్ని వెలిగిస్తారు. రోజుకు ఒక ఒత్తి చొప్పున ఏడాది మొత్తాన్ని సూచిస్తాయి ఈ ఒత్తులు. కొందరు దీపాలను అంటీ దొన్నె పై ఉంచి నదిలో లేదా కొలనులో వదులుతారు. ఇంకొందరు శివాలయంలో దీపాలు వెలిగిస్తారు. ఆ వీలు లేని వారు ఇంట్లోనే దేవుడి ముందు లేదా తులసి కోట ఎదుట దీపం వెలిగిస్తారు.

కార్తీక పౌర్ణమి నాడు శివాలయంలో దీపారాధన చేయడం అంటే ముక్కోటి దేవతలనూ పూజించడమే. సకల పుణ్యనదుల్లో స్నానం చేసిన ఫలం దక్కుతుంది. కార్తీక పౌర్ణమి నాడు చేసే దీపారాధనతో ఇహలోకంలో సుఖసౌఖ్యాలు, పరలోకంలో ముక్తి లభిస్తాయి.

కార్తీక పౌర్ణమి జైనులకు, పంజాబీలకు కూడా విశిష్ట పర్వదినం. గురునానక్ జయంతి కూడా ఈరోజే. ఈ విశేష పర్వదినాన గంగా మహోత్సవం కూడా నిర్వహిస్తారు.

## నాగుల చవితి

దీపావళి అమావాస్య తరువాత వచ్చే కార్తీక శుద్ధ చతుర్థిని నాగుల చవితి పండుగ అంటారు. కొందరు శ్రావణ శుద్ధ చతుర్థి నాడు కూడా ఈ పండుగ జరుపు-కుంటారు. నాగుల చవితి సంద-ర్భంగా పుట్టకు పూజలు చేస్తారు. [1] ప్రకృతి మానవ మనుగడకు జీవనాధారమైనది కనుక దానిని



దైవస్వరూపంగా భావించి పూర్వీకులు చెట్టును, పుట్టను, రాయిని, రప్పను, కొండను, కోనను, నదిని, పర్వతాన్ని - ఇలా సమస్త ప్రాణికోటిని దైవస్వరూపంగా చూసుకొంటూ పూజిస్తూవస్తున్నారు. అందులో భాగంగానే నాగుపాము ను కూడా నాగరాజుగా, నాగదేవతగా పూజిస్తూ వస్తున్నారు.

ఈ పాములు భూమి అంతర్భాగమందు నివసిస్తూ భూసారాన్ని కాపాడే ప్రాణులుగా సమస్త జీవకోటికి " నీటిని" ప్రసాదించే దేవతలుగా తలచేవారు. ఇవి పంటలను నాశనంచేసే క్రిమికీటకాదులను తింటూ, పరోక్షంగా రైతుకు పంటనష్టం కలగకుండా చేస్తాయి. అలా ప్రకృతి పరంగా అవి మనకు ఎంతో సహాయప-డుతూ ఉంటాయి.

హిందూ పురాణాలలో నాగుల చవితి గురించి ఎన్నో గాథలు ఉన్నాయి. దేశమంతటా పలు దేవాలయల్లో మెలికలతో ఉన్న నాగేంద్రుని విగ్రహాలు కనిపిస్తూ ఉంటాయి. ఈ నాగుల చవితి నాడు నాగేంద్రుని శివభా-వముతో అర్పిస్తే సర్వరోగాలు పోయి సౌభాగ్యవంతులవుతారని భారతీయుల నమ్మకం.

ఈ మానవ శరీరమనే పుట్టకు తొమ్మిది రంధ్రాలు ఉంటాయి. వాటినే నవరంధ్రాలు అంటూ ఉంటారు. మానవ శరీరంలో నాడులతో నిండివున్న వెన్నెముకను వెన్నుబాము అని అంటారు. అందు కుండలినీశక్తి మూలాధారచక్రంలో "పాము" ఆకారమువలెనే వుంటుందని "యోగశాస్త్రం" చెబుతోంది. ఇది మానవ శరీరంలో నిదురిస్తున్నట్లు నటిస్తూ కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలనే విషాల్ని గ్రక్కుతూ, మానవునిలో సత్వగుణ సంపత్తిని హరించి వేస్తూ ఉంటుందని అందుకు నాగుల చవితి రోజున ప్రత్య-క్షంగా విషసర్పపుట్టలను ఆరాధించి పుట్టలో పాలు పోస్తే మానవునిలో ఉన్న విషసర్పం కూడా శ్వేతత్వం పొంది, అందరి హృదయాలలో నివసించే శ్రీమహావిష్ణువు నకు తెల్లని ఆదిశేషువుగా మారి శేషపాన్పుగా మారాలని కోరికతో చేసేదే! ఈ నాగుపాము పుట్టలో పాలు పోయుటలోగల అంతర్యమని చెప్తారు.

నాగుల చవితి రోజు ఆవు పాలు పుట్టలో పోసి నాగ పూజ చేసి చలిమిడి, చిమ్మిలి (నువ్వులతో చేస్తారు) అరటిపళ్ళు, తాటి బుర్రగుంజు , తేగలు మున్నగున్నవి నివేదన చేస్తారు. ఆ సందర్భంగా పుట్ట వద్ద దీపావళి నాడు మిగిలిన మతాబులు, కాకరపువ్వొత్తులు, టపాసులు మొదలైనవి చిన్నపిల్లలు ఎంతో సంతోషంగా కూడా కాలుస్తారు.

భారతీయుల చాల ఇళ్ళల్లో ఇలవేల్పు సుబ్రహ్మణేశ్వరుడే ఆరాధ్య దైవంగా పూజిస్తారు కాబట్టి వారి పేరును చాల మంది నాగరాజు, ఫణి, సుబ్రహ్మణ్యం, సుబ్బారావు వగైరా పేర్లు పెట్టుకుంటూ ఉంటారు. ఆవిధంగా సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని ఆరాధిస్తే , తమ పిల్లలు , కుటుంబం అంతా క్షేమంగా ఉంటారని నమ్మకం .

# వార్తా విశేషాలు





**కొండా సురేఖకు కోర్టు ఆదేశం**

భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ మంత్రి కొండా సురేఖపై సివిల్ కోర్టులో పరువు నష్టం దావా వేయగా , విచారణ జరిగింది . ఆమెపై రూ 100 కోట్లకు కేటీఆర్ పరువు నష్టం దావా వేయగా , భవిష్యత్తులో అలాంటి వ్యాఖ్యలు చేయొద్దని కొండా సురేఖను న్యాయస్థానం ఆదేశించింది . కేటీఆర్ పై చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన వీడియోలను న్యూస్ చానళ్లు , యూట్యూబ్ , సోషల్ మీడియాలో తొలగించాలని పేర్కొంది . తదుపరి విచారణను వచ్చే నెల 21 కి కోర్టు వాయిదా వేసింది .

---


**సోమశిల -- శ్రీశైలం లాంచీ ప్రయాణం**



నల్లమల అటవీ ప్రాంతం కొండా కోనల మధ్య కృష్ణా నదిలో విహారానికి రాష్ట్ర పర్యాటక శాఖ సిద్ధమైంది . ఈ నెల 26 నుంచి నాగర్ కర్నూల్ జిల్లా సోమ శిల నుంచి శ్రీశైలం వరకు లాంచీ ప్రయాణాన్ని అందుబాటులోకి తీసుకురానుందని మంత్రి జూపల్లి ప్రకటించారు . కొల్లాపూర్ మండలం సోమశిల తీరంలో ఒకేసారి 120 మంది ప్రయాణించేలా డబుల్ డెక్కర్ తరహాలో ఏసీ లాంచీని ఏర్పాటు చేశారు . 7 గంటలపాటు కృష్ణా నదిలో సోమశిల నుంచి శ్రీశైలం వరకు లాంచీ ప్రయాణం ఉంటుంది . ఈ లాంచీ ప్రయాణానికి పెద్దలకు రూ 2వేలు , పిల్లలకు రూ 1600 టికెట్ ధర నిర్ణయించినట్లు సోమశిల లాంచీ ఇన్ ఛార్జ్ శివకృష్ణ తెలిపారు .

## జవహర్లాల్ నెహ్రూ జన్మదినం

భారతదేశ మొదటి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ 1889 నవంబర్ 14న జన్మించారు. అతను గులాబీలను చాలా ఇష్టపడేవారు, అలాగే పిల్లలను చాలా.ఇష్టపడేవారు . పిల్లలే ఈ దేశ భవిష్యత్తు అని జవహర్‌లాల్ నెహ్రూ నమ్మారు. పిల్లలు బాగా చదువుకుంటే అద్భుతాలు సృష్టించగలరు. పిల్లలను మనం పెంచే విధానం దేశ భవిష్యత్తును నిర్ణయిస్తుందని చెప్పేవారు. జవహర్‌లాల్ నెహ్రూ కాశ్మీరీ పండిట్ వర్గానికి చెందినవారు. అందుకే ఆయనను పండిట్ నెహ్రూ అని పిలిచేవారు. మోతీలాల్ నెహ్రూ తన కుమారుడు జవహర్‌లాల్‌ను తన స్వంత స్వరాజ్ పార్టీలో చేరాలని, కాంగ్రెస్‌ను వీడాలని కోరుకున్నారు. కానీ జవహర్‌లాల్ తన తండ్రి కోరికకు వ్యతిరేకంగా కాంగ్రెస్‌కు విధేయుడిగా ఉంటూ గాంధీజీతో కలిసి ఉండాలని నిర్ణయించుకున్నాడు.



1942 నుండి 1946 వరకు అహ్మద్‌నగర్‌లో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్న సమయంలో డిస్కవరీ ఆఫ్ ఇండియా అనే పుస్తకాన్ని ఆయన రచించారు.

జవహర్‌లాల్ నెహ్రూ 1927లో సంపూర్ణ జాతీయ స్వాతంత్ర్యం గురించి ఆలోచనను అందించారు. అతను 15 ఆగస్టు 1947 న ప్రధాన మంత్రిగా బాధ్యతలు స్వీకరించాడు. “ట్రస్ట్ విత్ డెస్టినీ” అనే తన ప్రసిద్ధ ప్రసంగాన్ని అందించారు.

---

## చైనావి 'ప్రమాదకర కార్యకలాపాలు ' -- కెనడా ఆరోపణలు

దక్షిణ చైనా సముద్రంలో అంతర్జాతీయ సముద్ర సరిహద్దుల మీదుగా ఎగురుతున్న తమ హెలికాప్టర్‌ను చైనా యుద్ధ విమానాలు ప్రమాదంలోకి నెట్టాయని కెనడా రక్షణ మంత్రి బిల్ బ్లెయిర్ అన్నారు.



కెనడా హెలికాప్టర్‌కు అతి దగ్గరగా వచ్చిన చైనా యుద్ధ విమానాలు, ఫ్లెయర్ పేల్చడం (హెచ్చరికగా మంటలను వదలడం) ద్వారా హెలికాప్టర్ సిబ్బంది ప్రాణాలను ప్రమాదంలో పడేశాయని ఆయన శుక్రవారం చెప్పారు. చైనా జెట్‌లు ఇటీవల తమ హెలికాప్టర్ పైనుంచి వెళ్లాయని, దీంతో హెలికాప్టర్ అటూ ఇటూ కదిలిపోయిందని బ్లెయర్ వెల్లడించారు. దీని తర్వాత మరో జెట్, హెలికాప్టర్ ముందు మంటలను పేల్చింది. వాటి నుంచి తప్పించుకోవడానికి అకస్మాత్తుగా తమ హెలికాప్టర్ గమనాన్ని మార్చాల్సి వచ్చిందని తెలిపారు. “ఈ విధంగా అందర్నీ అనవసరంగా ప్రమాదంలో పడేశారు. చైనా యుద్ధ విమానాలు చేపట్టిన ఈ చర్యలు చాలా ప్రమాదకరమైనవి'' అని ఆయన అన్నారు.

## కెనడాలో  చదువుకోవాలనుకునే భారతీయ విద్యార్థులకు షాక్

### సగానికి తగ్గనున్న స్టడీ వీసాలు ..




జస్టిస్ ట్రూడో ప్రభుత్వం కెనడాలో చదువు కోవాలనుకునే భారతీయ విద్యార్థులకు షాకులమీద షాకులిస్తోంది. ఇప్పటికే విదేశీ విద్యార్థులకు వారానికి 40 గంటలు ఉన్న వర్క్ పర్మిట్ ను 20 గంటలకు తగ్గించిన అక్కడి ప్రభుత్వం తాజాగా భారతీయ విద్యార్థుల సంఖ్యను 50 శాతం వరకు తగ్గించే ఛాన్స్ ఉంది. దీంతో ఆ దేశంలో చదువుకోవాలనుకునే భారతీయ విద్యార్థులకు మరింత కష్టాలు పెరిగాయి. ఈ విషయం భారత దేశ విద్యార్థులకు, అందులోను మరీ తెలుగు విద్యార్థులే ఎక్కువమంది ఉంటారు. కెనడాలో పెరుగుతున్న ఇళ్ల సమస్యతో పటు, నిరుద్యోగ సమస్యను నివారించడానికి కెనడా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది.

---

## తెలంగాణలోని మోడల్ పాఠశాలల్లో 19 వేల  మందికి పదోన్నతులు

తెలంగాణ లోని మోడల్ పాఠశాలల్లో 11 ఏళ్ల తరువాత 19 వేల  మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు, 35 వేల  మందికి బదిలీ చేపట్టామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు . కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం చిన్న ముల్కనూర్ మోడల్ స్కూల్ లో కలెక్టర్ పమేలా సత్పతి తో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్ విద్యార్థులకు షూస్ పంపిణీ చేశారు . అనంతరం గుడ్ టచ్ , బ్యాడ్ టచ్ పై విద్యార్థుల రోల్ ప్లే ను అధికారులతో కలిసి మంత్రి పొన్నం వీక్షించారు . కరీంనగర్ జిల్లాలో 23,000 మంది విద్యార్థులకు కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీ ఎస్ ఆర్ ) కింద షూస్ పంపిణీ చేశామన్నారు .రాష్ట్రంలో అమ్మ ఆదర్శ పాఠశాలల కింద 25 వేల పాఠశాలల్లో రూ  11 వేల కోట్లతో మౌలిక వసతులు కల్పించామని తెలిపారు . ఈ జిల్లా నుంచి మాజీ ప్రధాని పీవీ నరసింహారావు ప్రాతినిధ్యం వహించారని, 14 భాషల్లో మాట్లాడేవారని గుర్తు చేశారు. విద్యార్థులు



కూడా కష్టపడి చదివి ఇంగ్లీష్ , హిందీ , ఇతర భాషలు నేర్చుకుని కష్టపడి చదివి తల్లిదండ్రులకు గ్రామా- నికి, జిల్లాకు మంచిపేరు తీసుకురావాలని సూచించారు .

---

## పద్మశ్రీ గ్రహీత గుస్సాడీ కళాకారుడు కనకరాజు మృతి --- రేవంత్ రెడ్డి సంతాపం

పద్మశ్రీ గ్రహీత , ప్రముఖ గుస్సాడీ కళాకారుడు కనకరాజు మృతి పట్ల సీఎం రేవంత్ రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యు- లకు ప్రగాఢ సానుభూతి తెలియ చేశారు. అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించాలని ఆదేశించి, ఇందుకు సంబం- ధించిన ఉత్తర్వులు జారీ చేశారు సిఎం. గిరిజనుల సాంప్రదాయ నృత్యానికి జీవం పోసి, భావి- తరాలకు అందిస్తూ 94 సం || కనకరాజు కన్ను మూశారు. కేంద్ర ప్రభుత్వం 2021 నవంబర్ 9 న పద్మశ్రీ ప్రకటించి, అప్పటి రాష్ట్ర- పతి రామనాథ్ కోవింద్ చేతుల మీదుగా ప్రదానం జరిగింది.



కనకరాజు మృతి పట్ల ప్రధాని మోడీ సంతాపం వ్యక్తం చేస్తూ, గుస్సాడీ నృత్యం కోసం చేసిన ఆయన సేవలు మరువలేనివని అన్నారు . కనకరాజు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు .

---

## అమెరికా ప్రజల మొగ్గు ట్రంప్ కేనా --- కమలా హారిస్ కా ?

అమెరికా అధ్యక్ష ఎన్నికలకు తక్కువ సమయం మాత్రమే ఉంది. దీంతో అమెరికా వైస్ ప్రెసిడెంట్ కమలా హారిస్, అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎన్నికల ప్రచారంలో బిజీగా ఉన్నారు. ఎన్ని- కల రోజు వరకు 12 రోజుల పాటు జోరుగా ప్రచారం నిర్వహించేందుకు ప్లాన్ చేసినట్లు వాల్ స్ట్రీట్ జర్నల్ కు సంబంధించి కొత్త జాతీయ సర్వే పొలిటికో వెల్లడించింది.






అమెరికా అధ్యక్ష ఎన్నికల నవంబర్ 5వ తేదీ జరగనున్నాయి. కమలా హారిస్ పై ట్రప్ ను కు 47శాతం నుంచి 45 శాతం గెలుపు అవకాశాలు ఉన్నాయని తాజా సర్వే తెలిపింది. సర్వే మార్జిన్ లో ప్లస్ లేదా మైనస్ 2.5శాతం పాయింట్లలో వస్తుందని పేర్కొంది. పొలిటికో నివేదిక ప్రకారం ఆగస్టులో నిర్వహించిన పోల్ ప్రకారం హారిస్ 45శాతం పాయింట్ల స్వల్పంగా వెనకంజ వేశారు. సీఎన్ బీసీ ఆల్ అమెరికా ఎకనామిక్ సర్వే తెలిపిన వివరాల ప్రకారం ట్రంప్ 48 శాతం, హారిస్ 46శాతం పాయింట్స్ పొందారు. అటు స్వింగ్ రాష్ట్రాల్లోనూ ట్రంప్, హారిస్ మధ్య పోరు పోటాపోటీగా ఉంటుందని సర్వేలు అంచనా వేస్తున్నాయి.

అన్ని ప్రధాన జాతీయ, ప్రాంతీయ పోల్‌లను ట్రాక్ చేసే RealClearPolitics ప్రకారం, హారిస్ జాతీయ స్థాయిలో ట్రంప్‌పై 0.3 శాతం పాయింట్ల స్వల్ప ఆధిక్యంలో ఉన్నారు. మరోవైపు, యుద్ధభూమి రాష్ట్రాల్లో ట్రంప్ 0.9 శాతం పాయింట్ల ఆధిక్యంలో ఉన్నారు. 2024 అధ్యక్ష ఎన్నికలకు యుద్ధభూమి రాష్ట్రాలు అరిజోనా, నెవాడా, విస్కాన్సిన్, మిచిగాన్, పెన్సిల్వేనియా, నార్త్ కరోలినా, జార్జియా.చట్టబద్ధమైన బెట్టింగ్‌లు జరుగుతున్న ఎన్నికల వంటి భవిష్యత్ ఈవెంట్‌ల ఆధారంగా అమెరికన్ ఫైనాన్షియల్ ఎక్స్ఛేంజ్, ప్రిడిక్షన్ మార్కెట్ అయిన





కల్షి, హారిస్‌పై ట్రంప్‌కు ఆధిక్యాన్ని అందించింది. ఈ బెట్టింగ్ మార్కెట్ ప్రకారం, ట్రంప్‌కు ఎన్నికల్లో గెలిచే అవకాశాలు 61శాతం ఉండగా, హారిస్‌కు 39శాతం ఉన్నాయి.

ముఖ్యంగా ట్రంప్ కు మహిళల కంటే పురుష ఓటర్ల నుంచి ఉత్తమ ఫలితాలు వస్తున్నట్లు రిపబ్లికన్ పోల్‌స్టర్‌గా పనిచేసిన పబ్లిక్ ఒపీనియన్ స్ట్రాటజీస్ భాగస్వామి మికా రాబర్ట్స్ అన్నారు. ట్రంప్ నకు




యువకుల నుంచి మద్దతు బలంగా ఉందని పేర్కొన్నారు. యువతులు, మహిళలు ఎక్కువగా కమలా హారిస్ కు మద్దతు పలుకుతున్నట్లు తెలిపారు. కాగా సాధారణ ఎన్నికలకు దాదాపు 12 రోజుల ముందు 31 మిలియన్లకు పైగా అమెరికన్లు ఇప్పటికే ఓటు వేశారు. వీరిలో 13.6 మిలియన్లు వ్యక్తిగతంగా.. అయితే 17.7 మిలియన్లు వారి మెయిల్-ఇన్-బ్యాలెట్‌లను మార్చారు. వీరిలో మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా కూడా ఉన్నారు.

వాల్ స్ట్రీట్ జర్నల్ తాజా పోల్ ప్రకారం, ఎన్నికల రోజుకు రెండు వారాల కంటే తక్కువ



సమయం ఉన్నందున, రిపబ్లికన్ అభ్యర్థి మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ డెమొక్రాటిక్ అభ్యర్థి వైస్ ప్రెసి-డెంట్ కమలా హారిస్ కంటే 2% ఆధిక్యంలో ఉన్నారు. 2024 US అధ్యక్ష ఎన్నికల ప్రచారం చివరి రోజుల్లో, రిపబ్లికన్ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ డెమోక్రటిక్ అభ్యర్థి కమలా హారిస్ ఆధిక్యాన్ని తిప్పికొట్టినట్లు కనిపిస్తోంది. వాల్ స్ట్రీట్ జర్నల్ తాజా పోల్ ప్రకారం మాజీ అధ్యక్షుడు ట్రంప్ వైస్ ప్రెసిడెంట్ కమలా హారిస్ కంటే 2 శాతం ఆధిక్యంలో ఉన్నారు. 47 శాతం మంది ఓటర్లు ట్రంప్‌కు మద్దతిచ్చారని, 45 శాతం మంది హారిస్‌కు అనుకూలంగా ఉన్నారని సర్వేలో తేలింది. ట్రంప్ ఇప్పుడు ఆధిక్యంలోకి దూసుకెళ్లినప్పటికీ, ఆధిక్యం లోపం చాలా తక్కువ మార్జిన్‌లో ఉందని, ఎన్నికలు వరకు ఏమైనా జరగొచ్చని జర్నల్ పేర్కొంది.

అమెరికాలో అధ్యక్ష ఎన్నికలు సమీపిస్తున్న వేళ అధ్యక్షా అభ్యర్థులు డొనాల్డ్ ట్రంప్, కమలాహారిస్ ప్రచారం ఊపందుకుంది. కానీ వీరి ప్రచారంపై చైనా హ్యాంకర్లు పంజా విసురుతున్నట్లు తెలుస్తోంది. వీరి ఫోన్ కమ్యూనికేషన్లు లక్ష్యంగా చేసుకొని డ్రాగన్ సైబర్ ముఠా హ్యాకింగ్ కు పాల్పడుతున్నట్లు సమాచారం. ఈ మేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ, అంతర్జాతీయ కథనాలు వెల్లడించాయి . డోనాల్డ్ ట్రంప్ రన్నింగ్ మేట్ జేడీ వాన్స్ ఉపయోగిస్తున్న ఫోన్ల నుంచి చైనా హ్యాకర్లు డేటాను దొంగిలిస్తునట్లు న్యూయా-ర్క్ టైమ్స్ సంచలన కథనం వెల్లడించింది. వీరితోపాటు డెమోక్రెటిక్ అభ్యర్థి కమలాహారిష్, ఆమె రన్నింగ్ మేట్ టిమ్ వాజ్ ప్రచారాన్ని కూడా లక్ష్యంగా చేసుకున్నట్లు పేర్కొంది. వెరిజోన్ ఫోన్ సిస్టమ్స్ లోకి జొరబ-డిన హ్యాకర్లు సున్నితమైన సమాచారాన్ని దొంగిలించేందుకు ప్రయత్నిస్తున్నట్లు ఇదే కథనం తెలిపింది. చైనా ప్రభుత్వం మద్దతు ఉన్న సైబర్ ముఠా 'సాల్ట్ టైఫూన్ ' ఈ హ్యాకింగ్ కు పాల్పడి ఉంటారని సైబర్ సెక్యూరిటీ నిపుణులు అంచనా వేస్తున్నారు. అభ్యర్థుల ప్రచార వివరాలతో పాటు కేసులు వంటి సున్నిత-మైన సమాచారంపై హ్యాకర్లు దృష్టి పెట్టినట్టు తమకు తెలిసిందని అధికారులు వెల్లడించారు .

---

## ప్రపంచ ఆర్థిక వ్యవస్థ గాడిలో పడే అవకాశాలు --- కేంద్ర మంత్రి నిర్మల సీతారామన్



కొన్నేళ్లుగా తీవ్ర సవాళ్ళను ఎదుర్కొంటున్న ప్రపంచ ఆర్థిక వ్యవస్థ త్వరలోనే గాడిలో పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని కేంద్ర మంత్రి నిర్మల సీతారామన్ అన్నారు. ప్రస్తుతం అమెరికా పర్యటనలు ఉన్న ఆర్థిక శాఖ మంత్రి మీడియా నుద్దేశించి మాట్లాడుతూ, ప్రపంచ దేశాలు, బహు-పాక్షిక ఆర్థిక సంస్థల మధ్య ఆర్థిక సమన్వయం పెరుగుతున్న నేపథ్యంలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు మంచి రోజులు రానున్నాయని ఆమె అన్నారు. ఇంటర్నేషనల్ మానిటరీ ఫండ్, ప్రపంచ బ్యాంకు సంయుక్తంగా నిర్వహించిన చర్చలతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ గాడిలో పడే అవకాశాలు ఎక్కువగా

ఉన్నట్లు ప్రపంచ దేశాలు భావిస్తున్నాయని, ఫండ్, కేంద్ర బ్యాంకులు, వివిధ సంస్థలు, ప్రభుత్వాలు చేసిన ప్రయత్నాల వల్ల ద్రవ్యోల్బణం కొంతమేర తగ్గింది. దీనివల్ల ప్రపంచ ఆర్థిక వ్యవస్థ తిరిగి పుంజుకుంటుంది. అయితే ఈ విషయంలో దేశాలన్నీ మరింత జాగ్రత్తగా ఉంటాలి. ఆర్థిక వ్యవస్థలు స్థిరంగా ఉన్నాయి కానీ వెంటనే పుంజుకునేలా లేవు అని నిర్మలా సీతారామన్ అన్నారు.

---

## బంగ్లాదేశ్ లో హిందువుల భారీ ర్యాలీ --- రోడ్లన్నీ జన సంద్రం




రాజకీయ అనిశ్చితి కొనసాగుతున్న బంగ్లాదేశ్ లో భారీ స్థాయిలో హిందువులు ర్యాలీ నిర్వహించారు. మైనారిటీ హక్కుల పరిరక్షణ కోసం వేలాదిమంది వీధుల్లోకి వచ్చారు. సనాతన జాగరణ్ మంచ్ ఆధ్వర్యంలో చటోగ్రామ్ లో ఈ ర్యాలీ జరిగింది. మహమ్మద్ యూనస్ సారథ్యంలోని తాత్కాలిక ప్రభుత్వం ముందు 8 డిమాండ్లు ఉంచారు . వాటిని నెరవేర్చేవరకు వీధుల్లో తమ నిరసన కొనసాగుతుందని, కొందరు హిందూ ఉద్యమ కారులు పేర్కొన్నారు . రిజర్వేషన్లకు వ్యతిరేకంగా కొద్దినెలల క్రితం బంగ్లాలో హింసాత్మక ఘర్షణలు జరగగా, షేక్ హసీనా నేతృత్వంలోని అవామీ లీగ్ అధికారాన్ని కోల్పోయింది. హసీనా రాజీనామా చేసి భారత్ ను ఆశ్రయించవలసి వచ్చింది. ఎన్నికలు జరిగేవరకు తాత్కాలిక ప్రభుత్వ పాలన కొనసాగిస్తోంది.

---

## - అంతర్జాతీయ ప్రమాణాలతో 'యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ '

పోలీస్ ఉద్యోగమంటే భావోద్వేగంతో భావోద్వేగంతో కూడిన బాధ్యత అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.



మెరుగైన జీవితం, జీతాన్ని కాదనుకుని ఐఐటీ ల్లో చదివిన, ఎంటెక్ పూర్తి చేసిన ఎంతోమంది యువత పోలీసు శాఖలో చేరటం గొప్ప పరిణామమని పేర్కొన్నారు. పోలీసు అమరవీరుల సంతాన దినం సందర్భంగా సోమవారం




హైదరాబాద్ గోషామహల్ పోలీస్ శిక్షణ కేంద్రంలో అమరవీరుల స్థూపం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి ఆయన నివాళులర్పించారు. పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రానికి పెట్టుబడులు రావాలన్నా, ఉద్యోగ ఉపాధి అవకాశాలు పెరగాలన్నా శాంతి భద్రతలు కీలకమని అన్నారు.

**గ్రూప్ -1 మెయిన్స్ అభ్యర్థులకు శుభాకాంక్షలు -- సీఎం రేవంత్ రెడ్డి**

గ్రూప్ -1 అభ్యర్థులకు శుభాకాంక్షలు అంటూ ఎక్స్ లో పోస్ట్ చేశారు. ఎటువంటి ఆందోళన చెందకుండా పరీక్షలు రాసి, విజయం సాధించి, తెలంగాణ పునర్నిర్మాణంలో భాగస్వాములు కావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను అని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

**అమరులైన కానిస్టేబుల్, ఏఎస్సై కుటుంబాలకు రూ . కోటి పరిహారం : సీఎం**

శాంతి భద్రతలు , నిఘా విషయంలో తెలంగాణ పోలీసుల పాత్ర కీలకమని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు . హైదరాబాద్ లోని గోషామహల్ స్టేడియంలో నిర్వహించిన పోలీసు అమరవీరుల సంస్మరణ సభ కార్యక్రమంలో దేశ భద్రత , ప్రజల రక్షణలో పోలీసుల పాత్ర ఎనలేనిదన్నారు . విధి నిర్వహణలో మరణించిన అధికారులను గుర్తు చేసుకోవడం అందరికీ స్ఫూర్తి దాయకమని అన్నారు. అమరులైన వారి కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని చెప్పారు. అమరులైన కానిస్టేబుల్, ఏ ఎస్సై, సీఐ కుటుంబాలకు రూ కోటి 25 లక్షలు .. డీఎస్పీ, ఏఎస్సై కుటుంబాలకు రూ కోటి 50 లక్షలు ..ఎస్పీ, ఐపీఎస్ కుటుంబాలకు రూ 2 కోట్ల పరిహారం ఇస్తామన్నారు. శాశ్వత అంగ వైకల్యం పొందిన పోలీసులకు పరిహారం ఇస్తామని ప్రకటించారు.

పోలీసు సిబ్బంది పట్ల నాకు ప్రత్యేక అభిమానం ఉంది. పోలీసులు, వారి కుటుంబాలు ఆత్మ గౌరవంతో జీవించాలి . ఎవరి ముందో చేయి చాచే పరిస్థితి తెచ్చుకోవద్దని, విమర్శలకు అవకాశం ఇవ్వద్దని కోరుతున్నా. విధి నిర్వహణలో పోలీసులకు ఎలాంటి లోటు లేకుండా చర్యలు తీసుకుంటామని, వారి ఖర్చులు , ఇతర ఏర్పాట్లకు నిధులు కేటాయిస్తామని సీఎం అన్నారు. పెరుగుతున్న సాంకేతికత ద్వారా నేరగాళ్లు సరికొత్త విధానాలతో ముందుకొస్తున్నారు.

తెలంగాణ పోలీసుల విధానాలను ఇతర రాష్ట్రాలు పాటిస్తున్నాయి. మన ఫోరెన్సిక్స్ ల్యాబ్ అనేక రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోంది. మన సైబర్ క్రైమ్ విభాగం దేశం లోనే గొప్పదని కేంద్ర హోంశాఖ అభినందించింది.

# మానవ జన్మ రహస్యం



కందాళం రజనీ రాణి

భగవంతుని సృష్టిలో అత్యున్నతమైన జన్మ మానవ జన్మ . దైవ సాన్నిధ్యం పొందటానికి భగవంతుడిచ్చిన గొప్ప వరం మానవ జన్మ. అట్టి మానవ జన్మ పరమార్థం గ్రహించి జీవించుటే కావాలి మానవ జీవన లక్ష్యం. మానవ పుట్టుకలో దాగుంది సృష్టి రహస్యం ...

మానవ జననం

ప్రకృతి పురుషుల సంగమం
నాటింది మరో ప్రాణికి బీజం
బీజం ఇచ్చెను ఒక రూపం
ప్రకృతి పురుషుల ప్రతిరూపం.

అమరేను ఒకొక్క అవయవం
అవయవపొందు తెలిపేను లింగబేధం
మెలమెల్లగా మారేను పిండరూపం
పెరిగేను ప్రతినెల తల్లిగర్భం.

మల మూత్రాదులలో కొట్టుమిట్టాడు జీవం
తపనతో తిరిగితిరిగి తెలిపేను పైనం
బిడ్డకదలికతో పొంగేను తల్లి హృదయం
ప్రసవవేదన సైచి ఇచ్చేను జననం

భూమిపైకి వచ్చేను మరో ప్రాణం
ఉనికిని తెలిపేను బిడ్డ శోకం
పుట్టినప్పుడు శిశువు దైవస్వరూపం
అభంశుభం తెలియని ఆనంద రూపం.

మాయామోహ ప్రపంచంలో అడుగిడిన
అనంతరం
అవుతుంది శిశు మనసు కలుషితం
రాగా ద్వేషాలకు అవుతుంది బందితం
అనుభవిస్తుంది ఇలపైన కర్మ ఫలం.
ఆటు పోటులతో సాగిస్తుంది జీవితం
అవుతుంది ఏదో క్షణం జీవంలేని శవం
కనులు తెరిస్తే జననం,కనులుమూస్తే మరణం
అదే కదా ఈ మానవజన్మ రహస్యం .

మరణించేది ఈ ఈ దేహం ఒకటే. ఆత్మ అన్నది నిరంతరం, శాశ్వతం. మరణానంతరం ఆత్మ చేరుతుంది పిత్రు లోకం. అక్కడ జరుగుతుంది మంచి చెడుల కర్మ ఫల విశ్లేషణం. పాపకర్మల ఫలితంగా చేరుతుంది ఆత్మ మరో శరీరం.
అదే మరణాంతరం ఆత్మ ప్రయాణ రహస్యం.....

మరణాంతరం

విగతజీవి చిరునామా దేహం
ఎగిరిపోయింది దేహంలోని ప్రాణం
శాశ్వతమైనది ఒక్కటే ఆత్మస్వరూపం
విడువలేక పోతోంది భవబంధం .

దేహానికి జరిగేను దహనసంస్కారం
కలతచెందేను వీడిన ఆత్మరూపం
మొదలాయేను భూమిపై కర్మ కాండం
ప్రారంభించేను ఆత్మ పరలోక ప్రయాణం.

పన్నెండురోజులలో చేరేను పిత్రులోకం
ఆహ్వానించేను ఆత్మ బంధువర్గం
చేసేను ఆత్మకి మార్గదర్శకం
జరిగేను అచట ఆత్మశోధనం.

తలచేను భూమిపైన గడిపిన క్షణక్షణం
తెలుసుకునెను తన పనుల అరాచకం
తొలగిపోయెను పొరలు కమ్మిన అజ్ఞానం
బోధపడేను మరుసటి జన్మలోని కర్తవ్యం
తిరిగివచ్చేను అనుభవించగ కర్మ ఫలం.

# అమెరికాలో విద్యావిధానం



వేమూరి వేంకటేశ్వరరావు

మా ఊరిని "పార్కుల పట్టణం" అంటారు. మా ఊరు పురపాలక సంఘానికి చెందిన కచేరీకి ఒక పక్క పోలీస్ ఠాణా,రెండవ పక్క గ్రంథాలయం. ఈ గ్రంథాలయం ఒక అంతస్థు భవనం. నా అంచనా ప్రకారం 30,000 చదరపు అడుగులు ఉంటుంది. రాత్రి 9 గంటలవరకు తెరచి ఉంటుంది. ఇందులో సగం భాగం పిల్లలకి, సగం భాగం పెద్దలకి. సాయంకాలం 3 నుండి 6 వరకు, వారాంతంలోనూ బడి పిల్లలతో చాలా హడావిడిగా ఉంటుంది. ఈ గ్రంథాలయం ద్వారా కేలిఫోర్నియాలో ఉన్న ఏ గ్రంథాలయం నుండైనా పుస్తకాలు ఎరువు తెచ్చుకోవచ్చు. నేను వారానికొకసారైనా ఈ గ్రంథాలయానికి వెళ్లకుండా ఉండలేను. ప్రతి ఊళ్లోనూ ఇలాంటి గ్రంథాలయం - చిన్నదో, పెద్దదో - తప్పకుండా ఉంటుంది. ఒక్క పుస్తకాలే కాకుండా, కంప్యూటర్లు, వగైరాలు ఉంటాయి. ఇంకా అనేక కార్యక్రమాలు ఈ గ్రంథాలయాలలో జరుగుతూ ఉంటాయి. రాత్రి 9 గంటలవరకు తెరచి ఉంటుంది. ఇందులో సగం భాగం పిల్లలకి, సగం భాగం పెద్దలకి. సాయంకాలం 3 నుండి 6 వరకు, వారాంతంలోనూ బడి పిల్లలతో చాలా హడావిడిగా ఉంటుంది. ఈ గ్రంథాలయం ద్వారా కేలిఫోర్నియాలో ఉన్న ఏ


గ్రంథాలయం నుండైనా పుస్తకాలు ఎరువు తెచ్చుకోవచ్చు. నేను వారానికొకసారైనా ఈ గ్రంథాలయానికి వెళ్లకుండా ఉండలేను.




ప్రతి ఊళ్లోనూ ఇలాంటి గ్రంథాలయం - చిన్నదో, పెద్దదో - తప్పకుండా ఉంటుంది. ఒక్క పుస్తకాలే కాకుండా, కంప్యూటర్లు, వగైరాలు ఉంటాయి. ఇంకా అనేక కార్యక్రమాలు ఈ గ్రంథాలయాలలో జరుగుతూ ఉంటాయి.

2

కేలిఫోర్నియా రాష్ట్రంలో ప్రాథమిక, ఉన్నత విద్యలకి (K-12 అంటారు) అయ్యే ఖర్చు మేము కట్టే పన్నుల ద్వారా సమకూరుతుంది. ఇవి కేంద్ర ప్రభుత్వానికి కట్టే పన్నులు కావచ్చు, రాష్ట్ర ప్రభుత్వానికి కట్టే పన్నులు కావచ్చు, ప్రాంతీయ ప్రభుత్వానికి కట్టే పన్నులు కావచ్చు. ఉదాహరణకి మేము ఏటా కట్టే ఇంటి పన్ను (ఇంటి విలువలో 1% + అమాంబాపతులు) లో సింహ భాగం మా ఊళ్ళో ఉన్న పాఠశాలల బాగోగులకి ఉపయోగిస్తారు (బొమ్మ చూడండి). పిండి కొద్దీ రొట్టె కనుక సామంతులు నివసించే ఊళ్ళల్లో పాఠశాలల వనరులు బాగుంటాయి.కనుకపిల్లలు ఉన్న సామంతులు అక్కడ ఇళ్ళు కొనుక్కుని నివసించడానికి మొగ్గు చూపుతారు. కనుక అక్కడ ఇళ్ల విలువలు పెరుగుతాయి. కనుక వాళ్ళు ఎక్కువ పన్నులు కట్టగలరు. కనుక వాళ్ళ పాఠశాలలు బాగుపడుతూ ఉంటాయి. ఇది ఒక చక్రీయ వ్యవస్థ!! అయినా ఉన్నది సరిపోక గత వారం మా పేటలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో Fun Run అనే పిల్లల కార్యక్రమం నిర్వహించి తల్లి-




బొమ్మ: మా ఊళ్ళో మేము కట్టే ప్రతి డాలరూ ఎలా ఖర్చు అవుతోందో చెప్పే బొమ్మ

దండ్రుల దగ్గరనుండి $38,000 చందాల రూపంలో పోగు చేసేరు. కేలిఫోర్నియా రాష్ట్రంలో ప్రతి బాలుడు, బాలిక ఒకటవ తరగతి నుండి పన్నెండవ తరగతి వరకు తప్పనిసరిగా "పాఠశాల"కు వెళ్లి తీరాలి. తల్లిదండ్రులకి, పిల్లలకి మరొక మార్గం లేదు. ప్రభుత్వం నడిపే పాఠశాలలో బోధన, పుస్తకాలు, ఉచితం. పాఠశాలకి బదులు ఇంటికి గురువు వచ్చి పాఠం చెప్పవచ్చు, ప్రయివేటు సంస్థలునడిపేపాఠశాలకావచ్చు. మనం ఇక్కడ ప్రభుత్వ పాఠశాలల గురించే మాట్లాడుకుందాం. ఇక్కడ ప్రాథమిక పాఠశాల (Elementary school) లో TK (Transitional kindergarten) నాలుగేళ్ల పిల్లలకి, K (kindergarten) ఐదేళ్ల పిల్లలకి, తరువాత 1, 2, 3, 4, 5 తరగతులు ఉంటాయి. TK, K తరగతులు ఒక పూటే ఉంటాయి, పైగా అవి ఐచ్ఛికం. మాధ్యమిక పాఠశాల (Middle school) లో 6, 7, 8 తరగతులు, ఉన్నత పాఠశాల (High school) లో 9, 10, 11, 12 తరగతులు ఉంటాయి. ఇవి ఉదయం 8/8:30 నుండి సాయంకాలం 3/4 వరకు ఉంటాయి. పాఠశాలకు వెళ్లే ప్రతి విద్యార్థికి - వారి ఆర్థిక స్థోమతతో ప్రమేయం లేకుండా - ఉదయం భోజనం, మధ్యాహ్నం భోజనం పాఠశాలలో ఉచితంగా పెడతారు. ఉన్నత పాఠశాల తరువాత ఎవరి ఇష్టం వారిది.

ఇంత డబ్బు ఖర్చు పెట్టినా ప్రాథమిక విద్యలో అమెరికాలో కేలిఫోర్నియా 29 వ స్థానంలో ఉంది! ఇక్కడ ఉన్న 50 రాష్ట్రాలని పోల్చి చూస్తే మెసచూసెట్స్ 1 వ స్థానంలోనూ, వెస్ట్ వర్జీనియా 50 వ స్థానంలోనూ ఉన్నాయి! ఉదాహరణకి ఒక సగటు కేలిఫోర్నియా విద్యార్థికి గణితంలో నూటికి 23 మార్కులు వస్తున్నాయని గణాంకాలు చెబుతున్నాయి. మిగిలిన అంశాలు బాగా ఆకళింపు చేసుకుంటున్న వారు కూడా గణితం వచ్చేసరికి రాణించలేకపోతున్నారు. గణితానికి ముఖ్యంగా కావలసిన తార్కిక ఆలోచన, అమూర్త భావన (abstract thinking)

ఇక్కడ విద్యార్థులలో తక్కువ కనిపిస్తోంది. చేతులతో చేసే సాంకేతిక నైపుణ్యం ఎక్కువ-గా కనిపిస్తోంది. అందుకనే కాబోలు గణితంలో నైపుణ్యం చూపిస్తున్న విదేశీ విద్యార్థు-లకి అమెరికా విశ్వవిద్యాల-యాల్లో ఆదరణ లభిస్తోంది.

మా ఊళ్ళో 3 ఉన్నత పాఠశాల-లు, 4 మాధ్యమిక పాఠశాలలు, 9 ప్రాథమిక పాఠశాలలు వెరసి మొత్తం 16 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ఉన్నత పాఠశాలలో చదువు పూర్తి చేసినవారిలో 25% 4-ఏళ్ల కాలేజీ (సాధారణంగా, వి-శ్వవిద్యాలయం) చదువులకి వెళ్లి కనీసం BS డిగ్రీ సంపాదించు-కుంటే, 37% 2-ఏళ్ల చిన్న కాలేజీ చదువుతో సరిపుచ్చుకుని AA డిగ్రీ సంపాదించుకుంటారు. పోలికకి చెబుతున్నాను. నేను 1952 లో, ఇండియాలో, 11 వ తరగతి (SSLC) లో ఉన్నప్పుడు మా పాఠశాల నుండి 100 మంది విద్యార్థులు పరీక్షకి కూర్చున్నారు. వారిలో 27 మంది ఉత్తీర్ణలయ్యా-రు.వారిలో ముగ్గురంటే ముగ్గురు చదువు కొనసాగించి) స్నాతకో-త్తర పట్టాలు పుచ్చుకున్నారు.

3

ఉన్నత పాఠశాల తరువాత విద్య కొనసాగించ దలుచుకున్నవా-రికి కేలిఫోర్నియాలో స్థూలంగా నాలుగు మార్గాలు ఉన్నాయి: (1) సామాజిక కళాశాలలు (Community Colleges), (2) California State University



System, (3) University of California System, (4) Private Colleges & Universities. పై నాలుగింటిలో మొదటి రకం కళాశాలలో ప్రవేశం తేలిక, చదువుకి ఖర్చు తక్కువ, నాలుగవ రకం కళాశాలలో ప్రవేశం కష్టం, ఖర్చు చాలా ఎక్కువ. California Community College వ్యవస్థలో 116 కాలేజీలు ఉన్నాయి. ఈ కాలేజీలు అన్నీ అచ్చుగుద్దినట్లు ఒకేలా ఉండవు. ఉదాహరణకి, కొన్ని కాలేజీల-లో, కొందరు విద్యార్థులు జీతం (fees) కట్టకుండా, ఉచితంగా, చదువుకోవచ్చు. కానీ సాధార-ణంగా కేలిఫోర్నియా నివాసు-లకి జీతం ఏడాదికి $1,200/, పై రాష్ట్రాల నుండి వచ్చినవారి-కి జీతం $8,000/ ఉంటోంది. ఇక్కడ చదువుకి రెండు మార్గాలు ఉన్నాయి: (1) ఉన్నత పాఠశాల తరువాత మన ఇంటర్మీడియె-ట్ వంటి రెండేళ్ల పాఠ్య ప్రణాళిక ఇక్కడ చదువుకుని, కావలిస్తే తరువాత BA/BS డిగ్రీ కొరకు మరొక రెండేళ్లు University of California System లో మాత్రం చదువు పూర్తి చేసుకుని University of California వారి డిగ్రీ పుచ్చుకోవచ్చు. (2) లేదా, ఆ రెండేళ్లతో చదువు ఆపేసి AA (Associate of Arts) డిగ్రీ పు-చ్చుకుని (దీనినే, నా చిన్నతనం-లో, ఇండియాలో FA అనేవారు!) ఉద్యోగం చూసుకోవచ్చు. ఈ రెండవదే మన గమ్యం అయిన-ప్పుడు ఆ AA డిగ్రీ కి కావలసిన పాఠ్య ప్రణాళికలో వృత్తివిద్యలు (అనగా, వడ్రంగం, కమ్మరం, ఎలెక్ట్రీషియన్, నీటిగొట్టాల యాం-త్రికత, కారు మెకానిక్, వెల్డింగ్, కంప్యూటర్లు, వగైరా అంశాలు) ఎన్నుకుంటారు. తదుపరి ఉమే-జువారీ (apprenticeship) పద్ధ-తిలో కొన్నాళ్ళు పని చేసి, ఎవరి వృత్తిలో వారు స్థిరపడిపోతారు. ఇవేమీ నామోషీ పడవలసిన వృత్తులు కావు. వీరంతా గంటకి $100/ కి పైబడే పుచ్చుకుంటారు.

(ఇంకా వుంది)

# బ్రహ్మఖండం

డా.పోచనపెద్ది వెంకట మురళీ కృష్ణ



వేదవ్యాస మహర్షి రచించిన అష్టాదశ పురాణాలలో స్కాంద పురాణం ఒకటి. ఎనభైఎనిమిది వేల ఒక వంద శ్లోకములతో కూడిన ఈ పురాణం పురాణాలలోకెల్లా అతి పెద్దది.
ఈ పురాణం మహేశ్వర, వైష్ణవ, బ్రహ్మ, కాశీ, అవంత్య, నగర మరియు ప్రభాస అనే ఏడు (7) ఖండాలుగా విభజింపబడింది. అందులో మూడవ భాగమైన 'బ్రహ్మ ఖండం' మూడు ఉపఖండాలుగా విభజింపబడింది.
ఇదివరలో మన చైతన్యం సంకల్పబలం పత్రికా పాఠకులకు 'కాశీ ఖండం' అందించిన ప్రముఖ రచయిత శ్రీ పోచనపెద్ది వేంకట మురళీకృష్ణ గారు ఇప్పుడు 'బ్రహ్మఖండం' సమర్పిస్తున్నారు.
పాఠకులు ఈ పురాణ పఠన సదవకాశాన్ని వినియోగించుకుని ఆ పరమేశ్వరుని కృపకు పాత్రులు కాగలరని ఆశిస్తున్నాము.


-ఎడిటర్

14. వ. అధ్యాయం

బ్రహ్మకుండ ప్రశస్తి.

అమృత వాపిలో స్నానం చేసిన తరువాత ఏకాంత రాఘవుని సేవించాలి. అక్కడనుండి బ్రహ్మకుండం దగ్గరకు వెళ్ళాలి..గంధ మాదన పర్వతంపై బ్రహ్మకుండం ఉంది. ఈ తీర్థం సేవిస్తే దరిద్రం పోతుంది. బ్రహ్మ హత్యాది పాపాలు, నశిస్తాయి. ఈ తీర్థంలో స్నానం చేస్తే ఇతర యజ్ఞ యాగాది కార్యాలు చేయనక్కరలేదు. వైకుంఠం లభిస్తుంది. బ్రహ్మకుండంలోని భస్మాన్ని ధరిస్తే త్రిమూర్తులు అనుసరిస్తారు. ముక్తి లభిస్తుంది. ఈ కుండంలోని భస్మాన్ని శరీరంపై చల్లుకుంటే

రౌరవాది నరకాలు రావు. సుఖాలు లభిస్తాయి. లోకాలను పవిత్రం చేస్తుంది. బ్రహ్మకుండంలోని భస్మాన్ని విడిచి పెట్టి, ఇతర భస్మాలను ధరించకూడదు. ఆ భస్మాన్ని బ్రాహ్మణులకు దానం చేయాలి. పూర్వం శివుని శాపం నుండి విముక్తి పొందడానికి బ్రహ్మ ఇక్కడ యజ్ఞం చేసాడు.




"ఈ సృష్టికి నేనే కర్తను  అని బ్రహ్మ , విష్ణువు వాదించికుంటున్నారు. వీరి శక్తిని పరీక్షించడానికి శివుడు తేజస్సు రూపంలో లింగంగా ఆవిర్భవించాడు. ఈ లింగానికి ఆద్యంతం తెలుసుకున్నవారే ఈ లోకానికి కర్తలు అని నిర్ణయించుకొని, బ్రహ్మ ఊర్ధ్వ భాగానికి, విష్ణువు అధోలోకానికి ప్రయాణమయ్యారు.

విష్ణువు వరాహ రూపంలో అధో లోకాలకు ప్రయాణమయ్యాడు. బ్రహ్మ హంస రూపాన్ని పొంది ఊర్ధ్వ లోకాలకు బయలు దేరాడు. విష్ణువు అధోలోకానికి ప్రయత్నించి భంగ పడి తిరిగి ' ఆ లింగానికి ఆది చూడలేదు" అని ప్రకటించాడు. బ్రహ్మ ఊర్ధ్వ లోకాలు తిరిగి వచ్చి " ఈ లింగానికి అంతం చూసాను" అని ప్రకటించాడు. " బ్రహ్మ! నా ఎదుట అబద్ధం చెప్పావు. నీకు పూజాది కాలు ఉండవు. అని శపించాడు ."  విష్ణువు నీవు నిజం చెప్పావు కనుక నాతో సమానంగా పూజలు జరుగుతాయి" అని వరం ప్రసాదించాడు.

" జగదీశ్వరా! ఈ ఒక్క అపరాధాన్ని మన్నించు" అని ప్రార్థించాడు. " ఓ వత్సా! నీవు గంధ మాదన పర్వతానికి వెళ్ళి, అక్కడ క్రతువులు చేయి. తరువాత నీకు కూడా పూజలు లభిస్తాయి" అని చెప్పాడు. బ్రహ్మ ఎనభైవేల సంవత్సరాలు తపస్సు చేసి, యజ్ఞాలు చేసాడు. "ఇక్కడ స్నానం చేస్తే ముక్తిద్వారం తెరుచుకుంటుంది. బ్రహ్మ హత్యా దోషం, సురాపన దోషం, గురుతల్ప దోషం, దొంగ తనం దోషం పోతాయి " అని శివుడు వరాన్ని ప్రసాదించి అంతర్ధానమయ్యాడు.

ఇంద్రాది దేవతలు బ్రహ్మకుండం దగ్గరే ఉంటారు.బ్రహ్మ శివుని దగ్గర వరాన్ని పొంది సత్యలోకానికి వెళ్ళిపోయాడు. ఆనాటి నుండి దేవతలు అక్కడకే వచ్చి, యజ్ఞాదులు చేస్తున్నారు. ఇక్కడే యజ్ఞాలు చేయాలి, దేవతులు మానవులు  ఈ కుండానికి నమస్కరించాలి. సకల పాపాలు నశిస్తాయి.

స్కాంద పురాణంలోని బ్రహ్మ ఖండంలోని సేతుమాహాత్మ్యలోని "బ్రహ్మ కుండ మహాత్మ్యం" అను పదునాల్గవ అధ్యాయం సమాప్తం.

# జ్యోతిర్లింగ యాత్ర



ఏడవది : శ్రీకేదారనాథ్ జ్యోతిర్లింగం

డా॥కె.రామానందం

శ్లో॥ మహాద్రి పార్శ్వే చ తటే రమంతం సంపూజ్యమానం సతతం మునీంద్రై:।
సురాసురై: యక్ష మహోరగాద్యై:యం కేదారమీశం శివమేకమీడే॥



కేదార పర్వతశ్రేణిపై మనోహరమైన జ్యోతిర్లింగ రూపంలో మునీశ్వరుల చేత, దేవతల చేత, యక్షకిన్నెరాదుల చేత ఎల్లవేళలా సేవించబడుతున్న కేదారేశ్వరుని కొనియాడుతున్నాను. ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రాల్లో కేదార్‌నాథ్ ఏడవది. కేదారనాథ్, తుంగనాథ్, మధ్యమహేశ్వర్, రుద్రనాద్, కల్పేశ్వర్ అనే ఐదు క్షేత్రాలకు పంచ కేదారాలు అనిపేరు. ఈ క్షేత్రాలన్నీ హిమాలయ పర్వత శిఖరాల్లో ఉన్నాయి. వాటిని దర్శించిన వారి వెనుక 14 తరాలు వారి ముందు 14 తరాలు తరిస్తాయని పెద్దలు ఉవాచ. ఈ పావన క్షేత్రాలు (5) ఉత్తరాంచల్ రాష్ట్రంలో రుషికేశ్ నుంచి 250 కి.మీ దూరంలో హిమాలయ పర్వతశ్రేణుల్లో ఉన్నాయి.

పంచ కేదారాలకు చెందిన స్థలపురాణం పాండవులు మహాప్రస్థాన యాత్రతో ముడిపడిరది. ఉత్తరదిశగా హిమాలయాల వైపు సాగిన పాండవులు శివుని కోసం వెతుకుతున్నారు. భీముడు రెండు కొండలపైకి ఎక్కి చుట్టూ చూడసాగాడు. గుప్తకాశీలో శివుడు ఎద్దు రూపంలో దర్శనమిచ్చాడు. దివోదాసు కాలంలో కాశీ క్షేత్రాన్ని వదిలిన శివుడు హిమాలయ పర్వతాల్లో రహస్యంగా అక్కడే సంచరించాడు. ఎద్దు రూపంలో ఉన్న శివుణ్ణి చూసిన భీముడు శివుణ్ణి ఆరాధించే ఉద్దేశ్యంతో పరుగున



వెళ్ళి వెనుక వైపు తోక, కాళ్ళు పట్టుకునే ప్రయత్నం చేస్తాడు. ఈపెనుగులాటలో నంది వెనుక భాగం భీమునికి దొరుకుతుంది. అందువల్ల అప్పటినుండి ఇచ్చట శివుడు నంది వెనుక భాగం రూపంలో వెలిశాడని అంటారు. ఆ నంది యొక్క ముఖ భాగం నేపాల్‌లో పడిరదంటారు. ఆ నంది ముఖభాగం పడిన చోట పశుపతినాథ్ దేవాలయం ఉంది. ఈ అయిదు క్షేత్రాలను దర్శించుటకు ఉపయుక్తులైన భక్తులు కాలినడకన, వ్యయ ప్రయాసలకోర్చి ఎత్తైన కొండలు ఎక్కుతూ, దిగుతూ మార్గమధ్యంలో నెలకొల్పబడిన ధర్మశాలల్లో వసతి ఏర్పాటు చేసుకొంటూ విశ్రాంతి తీసుకుంటూ ఐదు క్షేత్రాలలో ఐదు రాత్రులు నిద్రిస్తే శివ పరమాత్మ అనుగ్రహం లభిస్తుంది. అనుకున్న కోర్కెలు నెరవేరుతాయి. మన:శాంతి లభిస్తుంది. అనారోగ్య సమస్యలు తగ్గి, సంపూర్ణ ఆరోగ్యం పొందుతారు. భక్తులకు పట్టుదల, మనోధైర్యం, నమ్మకం ఉండి, ఆరోగ్యం సహకరిస్తే ఇంతటి చక్కటి యాత్ర మరొకటి ఉండదు.

పంచ కేదార క్షేత్రాలు సంవత్సరములో ఆరు నెలలు మాత్రమే తెరచి ఉంటాయి. సాధారణంగా ఈ ఆలయములు మే నెలలో వచ్చే అక్షయతృతీయ నాడు వైశాఖమాసంలో తెరుస్తారు. అక్టోబర్ నెల చివరిలో మూసివేస్తారు. అక్టోబర్ తరువాత ఈ ఆలయాల వద్ద మంచుపేరుకుపోయి, చాల ఇబ్బందులకు లోనవవలసి వస్తుంది. అట్టి వాతావరణంలో అచ్చట ఉండటం శ్రేయస్కరం కాదు. ఈ అయిదు కేదారాలు సముద్రమట్టానికి సుమారు 3200 మీటర్ల ఎత్తులో ఉన్నవి. ఒంటరిగా కాక ఒక బృందంగా ఏర్పడి యాత్ర చేస్తే ప్రకృతి రమణీయతను ఆస్వాదించ వచ్చును. పర్వతాల మీద ఉదయం సూర్యోదయం సమయంలో వెండి కొండలవలె దర్శనమిస్తాయి. కైలాసమంటే ఇదేనేమో అనే భావన కలుగుతుంది. కేదారనాథ్ యాత్ర అనేక జన్మ జన్మల ఫలం అని భక్తుల విశ్వాసం.

కేదార్‌నాథ్: పంచ కేదారాల్లో మొదటిదైన కేదారనాథ్ రుషికేశ్ నుండి సుమారు 250 కి.మీ దూరంలో సముద్ర మట్టానికి సుమారు 3,584 మీటర్ల ఎత్తులో



రుద్ర ప్రయాగ జిల్లాలో ఉంది. కేదారనాథ్ వాహనాల్లో వెళ్ళేందుకు రోడ్డు సౌకర్యం లేదు. సమీపంలోని గౌరీకుండ్ వరకు మాత్రమే వాహనాలు వెడతాయి. యాత్రికులు డిల్లీ నుంచి రైలు, బస్సు మార్గాలు ద్వారా హరిద్వార్ చేరతారు. అక్కడ నుంచి హృషీకేశ్‌కు చేరుతారు. హృషీకేశ్ నుండి బస్సులో సుమారు ఆరుగంటలు ప్రయాణిస్తే, 'రుద్ర ప్రయాగ' చేరుతారు. అలకనంద, మందాకిని నదులు ఇక్కడ కలుస్తాయి. రుద్ర ప్రయాగ నుండి హిమాలయ పర్వత శ్రేణుల్లోని సుందర ప్రకృతి దృశ్యాల నడుమ సమారు ఆరుగంటలు ప్రయాణం చేసి ''గౌరి కుండ్'' చేరుకుంటారు. ఇచ్చట భక్తులు వేడినీళ్ళ కుండంలో స్నానం చేస్తారు. ఈ కుండం ప్రక్కనే గౌరిమాత ఆలయం ఉంది. ఈ ప్రాంతంలోనే పార్వతీదేవి శివుని కోసం తపస్సు చేసిందని అంటారు. ఇక్కడ చక్కని జలపాతాలను తిలకించవచ్చును. గౌరీకుండ్ నుంచి కేదారనాథ్‌కు 14 కి.మీ దూరం. ఈ 14 కి.మీ దూరాన్ని సులువుగా కాలినడకను ఎంచుకొని 'ఓం నమః శివాయ' పంచాక్షరి మంత్రాన్ని భక్తి పారవశ్యంతో ఉచ్చరిస్తూ, ప్రకృతిని ఆరాధిస్తూ, తోటి యాత్రికులతో ముచ్చటిస్తూ కేదారనాధుని దర్శనం చేసుకుందామనే తపనతో, మొదటి మజిలీ 'రాంబలా' చేరి కొద్దిసేపు విశ్రాంతి తీసుకుని రెండవ మజిలీ 'గరుడజెట్టి' జేరుతారు. ఈ మజిలీ నుంచి యాత్రికులకు కేదారనాథ్ ఆలయ శిఖరము చూసే అదృష్టం కలుగుతుంది. ఇక్కడి నుంచి బయలుదేరిన భక్తులు మందాకినీ ఒడ్డున గల కేదారనాథ్ చేరగానే నడిచివచ్చిన శ్రమనంతటిని మరిచి పరమేశ్వరుడిని మనసా, వాచా, కర్మణా కృతజ్ఞతలు అర్పించి, కేదారనాధుని దర్శించి తరిస్తారు. గౌరీకుండ్ నుండి కేదారనాథ్‌కు డోలీలు ద్వారా లేదా గుర్రాల మీద

కాని యాత్ర జేసి పావన క్షేత్రాన్ని జేరవచ్చు. ఈ సదుపాయం కావలసిన వారు రుసుం చెల్లించి ప్రయాణం జేయవలసివస్తుంది. గౌరీకుండ్ నుండి యాత్రికుల సౌకర్యార్ధం హెలీకాప్టర్ సర్వీసు ఉన్నది. ముందుగా టిక్కట్టు కొని ప్రయాణం కన్‌ఫర్మ్ చేసుకోవలసి ఉంటుంది. ఊబకాయం ఉన్నవారి వద్ద అనగా 90కిలోల బరువు దాటిన వారి నుంచి ప్రతికిలో బరువుకు రు.150లు అధికంగా వసూలు చేస్తారు. హెలికాప్టర్ నుంచి క్రిందికి చూస్తే మేను పులకరిస్తుంది. పచ్చని చెట్లతో కూడిన పర్వత శ్రేణులు, వాటిని చుడుతూ ప్రవహిస్తున్న నదులు, అక్కడక్కడ గడ్డ కట్టిన మంచుగడ్డలు, పాము మెలికల్లా సాగుతున్న రహదారులు, జలపాతాలు, సరస్సులు చూసి ఆనందంతో గాలిలో పయనిస్తాం. హెలికాప్టర్ ప్రయాణం 10 `12 నిమిషాలైనా అందాలు/కాంతులు చూసి మంత్రముగ్ధులౌతారు. కేదారనాథ్ ఆలయం ముందు వైపు విశాలమైన ప్రాంగణం ఉంది. ఆలయం చుట్టూ ప్రదక్షిణా మార్గం ఉంది. ప్రధాన ప్రవేశ ద్వారానికి పది అడుగుల దూరంలో నందీశ్వరుడు కొలువు తీరి ఉన్నాడు. గర్భాలయంలో కేదారేశ్వరుడు చిన్న పర్వత త్రికోణాకార ఆకారంలో దర్శనమిస్తాడు. భక్తులు స్వయంగా అభిషేకం చేయవచ్చు. ఆలయ ప్రాంగణంలో పాండవులు విగ్రహలను,



కుంతీదేవి విగ్రహాన్ని చూడగలము .
ఇక్కడ లింగానికి నెయ్యిరాసి అభిషేకం చేస్తారు. భీముడు నంది వెనుక భాగాన్ని గదతో కొట్టడం వల్ల కలిగిన గాయాన్ని ఉపశమింప జేయడానికి నేతితో లింగానికి అభిషేకం చేస్తారని ప్రతీతి. తెల్లవారురఝామున 5 గం॥లకు జరిగే అభిషేకం విశేషమైనది.. భక్తులు ఈ అభిషేకాన్ని తిలకించి తమ జన్మ సార్ధకమైనట్టు భావిస్తారు. సూర్యోదయ సమయంలో హిమాలయ పర్వతాలు వెండికొండల వలె దర్శనమిస్తాయి. చాలామంది ఋషులు ఇప్పటికీ ఈ హిమాలయాలలో తపస్సు చేసుకుంటూ స్వామివారి దయకు పాత్రులవుతున్నారు. మరొక గాథ ప్రకారం కృతయుగంలో నరనారాయణులు శివుని కొరకు తపస్సు చేసారు. వీరి తపస్సుకు మెచ్చి శివుడు ప్రత్యక్షమై వరం కోరుకోమంటాడు. నరనారాయణులు "మా కోసం ఏ వరమూ వద్దు. కానీ ముందు యుగాల వారు తరించుటకై మీరు ఇక్కడ జ్యోతిర్లింగ రూపుడై ఉండాలనేది మా కోరిక" అంటారు. అందుకు పరమేశ్వరుడు అంగీకరించి జ్యోతిర్లింగ రూపుడై యిక్కడ వెలిశాడు. ఆలయ వెనుక వైపు నుండి స్వర్గానికి పాండవులు వెళ్ళినట్టుగా చెప్పుకునే ప్రస్థాన మార్గం ఉన్నది. దత్తాత్రేయ గుహ, శంకరాచార్యుల వారి సమాధి దర్శించవచ్చును. మన దేశ ప్రధానమంత్రి శ్రీ నరేంద్రమోదీ ఈ మధ్య కాలంలో శంకరాచార్యుల వారి సుందర విగ్రహాన్ని కేదారనాథ్‌లో ఆవిష్కరించారు. ఆలయ ప్రదక్షణ సమయాన ఆలయ వెనుక భాగములో అతిపెద్ద శిల కొండల్లోంచి వచ్చిన తుఫాను

నీటిలోంచి కొట్టుకొంటూ వచ్చి ఆలయం వెనుక నిలిచిపోయింది. ఆ మహిమాన్విత శిలయే 2013లో వచ్చిన వరదల వేగంలో ఆలయం కొట్టుకుపోకుండా వరద వేగాన్ని వేరు మార్గములో పయనించేలాగ చేసిందంటారు. పరమేశ్వరుని ఉనికికి ఇదినిదర్శమని చెప్పవచ్చు. కైలాసం గురించి అనేక గాథలు ప్రచారంలో ఉన్నాయి. సప్త ద్వీపాలను ఏలిన కేదారుడనే మహారాజు ఈ కొండలపై తీవ్రమైన తపస్సు చూయడం వల్ల ఈ ప్రాంతాన్ని కేదారేశ్వరమని అంటారు. ఇది నరనారాయణులు తపస్సు చేసిన ప్రదేశం. వారి కోరికననుసరించి నిజ రూపంలో ఈశ్వరుడు నివసించిన ప్రదేశంగా పరిగణిస్తారు. 11750 అడుగుల ఎత్తున ఈ ఆలయం ఉండటం వల్ల ప్రాణవాయువు తక్కువగా ఉంటుంది. యాత్రికులు కేదారనాథ్ లో ఉన్నప్పుడు పచ్చకర్పూరాన్ని ఇచ్చి దానిని ఒక చిన్న వస్త్రంలో ఉంచి పీలుస్తూ నడవమంటారు. ఇచ్చట విధ్యుత్తు సరఫరా తక్కువ కావడం వల్ల యాత్రికులు బ్యాటరీలైట్లు వినియోగిస్తారు.
ప్రతి సం॥ దీపావళి తర్వాత నుండి మే నెల వరకు (ఆశ్వయుజమాసం నుండి వైశాఖ మాసం వరకు) ఈ దేవాలయాన్ని మూసి వేస్తారు. ఆ కాలంలో పర్వతం దిగువున గల ''ఉక్కినాథ్'' గ్రామంలో కేదారేశ్వరునికి పూజలు నిర్వహిస్తారు. ఆశ్వయుజమాసం ప్రారంభంలో దేవాలయాన్ని మూసి వేసే సమయంలో వెలిగించిన జ్యోతి, మళ్ళీ మే నెలలో తిరిగి దేవాలయాన్ని తెరిచే వరకు వెలుగుతూనే ఉంటుందని అంటారు. ప్రతి ఏటా యాత్రికులు లక్షల సంఖ్యలో వచ్చి భక్తి శ్రద్ధలతో స్వయంగా ఆభిషేకం చేసుకుని అనేక జన్మల పుణ్యఫలంగా భావిస్తారు.

**ఇతర మందిరాలు:**

ఆదిశంకరాచార్యులవారు కేరళలో జన్మించి, తల్లి అనుమతితో సన్యశించి ఆసేతు హిమాచలము పలుమార్లు కాలినడకన పర్యటించి ఆనైక్యతతో కొట్టుమిట్టాడుతున్న హిందూధర్మాన్ని పునర్జీవింప చేసారు. తన 32వ సం॥లో ఆది శంకరులు కేదారేశ్వం జేరుకొని ఆలయ వెనుక ఉన్న కొండ ప్రాంతంలో సిద్ధి సమాధి చెందారు. ఆయన సమాధి కేదారేశ్వరుని ఆలయ వెనుకనే ఉంది. పాండవుల తండ్రి అయిన పాండు మహారాజు ఇక్కడనే మరణించినట్లు ఐతిహ్యం. ఆ స్థలాన్ని పాండుకేశ్వర్ అంటారు. దేవాలయం ప్రక్కనే పాండవుల స్వర్గారోహణం చేసిన పర్వతమే ''స్వర్గారోహిణి'' ఉంది. ధర్మరాజు తప్ప మిగిలిన నలుగురు పాండవులు హిమాలయాలలో పయనిస్తు మార్గమధ్యంలో భగవదైక్యము చెందినారట. కేదారనాథ్ ఆలయానికి 7మైళ్ళ దూరంలో భైరవశిల, భీమగుహ, మధుగంగ అనే ప్రదేశాలున్నాయి. ఇంకా చాల దూరం పయనిస్తే వాసుకి చెరువు, క్షీరగంగ అనే ప్రదేశాలు కనబడతాయి. కేదారనాథ్ దర్శనానికి వచ్చిన యాత్రికులు ఉండుటకు వసతి సౌకర్యాలు, సత్రాలు, హోటళ్ళు ఉన్నాయి. మే, జూన్ నెలలో చాల చలిగా ఉంటుంది. చలి తట్టుకునే 'రజాయిలు' అద్దెకు ఇస్తారు. కుంభరాశివారికికేదారేశ్వరలింగం శ్రేయోలింగం. ఈ రాశికి శని అధిపతి. గ్రహపీడలు, శత్రుబాధలు, ఇతర దోషాలు విముక్తికి గాను, ఈ రాశివారు కేదారేశ్వర దర్శనం, నిత్యం ''మహద్రి పార్శ్వే చ తటే రమంతం, సంపూజ్యమానం సతతం మునీంద్రై: సురాసురై: యక్ష మహారగాద్యైం: కేదారమీశం శివమేకమీడే'' అనే శ్లోకాన్ని పారాయణం చేయాలి. శనివారం రుద్రాభిషేకం చేస్తే మంచిది. కైలాస్‌నాద్ దర్శనం కైలాసమనే విశ్వాసం కూడా ఉంది. ఆ ఉమాపతి దయాసాగరుడు. ఆయనను భక్తి వినమ్రులతో అర్చించి, దర్శించి పూజిస్తే, ఆయన కృపతో ముక్తి లభిస్తుందని, ఇచ్చట క్షేత్రములో దానము చేస్తే వారు శివైక్యం చెందుతారని విశ్వాసం. కేదారనాథ్‌ను దర్శించకుండా బదరీ నారాయణ యాత్ర పూర్తికాదని భక్తుల విశ్వాసం. ఇది శైవ, వైష్ణవ ఐక్యతను సూచిస్తుంది

ఓం నమ:శివాయ

# గెలుపు గుర్రాలు

ఎలెక్ట్రాన్



పదోతరగతిబోర్డుపరీక్షాఫలితాలు ప్రకటితమైయ్యాయి. విద్యావికాస్ సుదీర్ఘమైన వరండాలో చాలామంది విద్యార్థినీ విద్యార్థులు నోటీసు బోర్డులవద్ద గుమిగూడారు. మార్కులు అధికంగా వచ్చిన ముగ్గురి పేర్లు పసుపు రంగులో ప్రస్ఫుటం చేయబడ్డాయి. ఆ స్కూలుకు సంబంధించి మొదటి స్థానం విద్యార్థి బ్రహ్మానందం. రెండు మూడు స్థానాలు విద్యార్థినులవి. మార్కులశాతం 98.2,98.1,98.00. ఎప్పుడూ అన్నిపరీక్షల్లోనూ 99.98 శాతంతో ప్రథముడిగా నిలిచే కిశోరవర్మ 97.50 శాతంతో పదో స్థానంలోకి దిగజారిపోయాడు. విద్యవికాస్ ప్రిన్సిపాల్ లేదా ప్రధానోపాధ్యాయుడు సుదర్శనరావు కిశోరవర్మని తన గదిలోకి పిలిచి "అందరు ఉపాధ్యాయులూ రాష్ట్రస్థాయి ప్రథముడివిగా వస్తావనుకొన్నారు, ఏమిటిలా జరిగింది!?" అని ప్రశ్నించాడు.

"పరీక్షల సమయంలో మా అమ్మకి తీవ్రమైన అనారోగ్యం కలిగింది. ఆస్పత్రిలో చేర్పించాము. బెంగచేత నా ధ్యాస సరిగా కుదరలేదు సార్! సమాధానాలు సరిగా రాసినా అక్కడక్కడా అక్షరాల తప్పులు దొర్లి ఉండొచ్చు. అయినా పర్వాలేదు, తొంభైలు దాటి ప్యాసయాను కదా సర్!"

"సరేలే, దిగాలుపడకు. ఈ సరికి మీ అమ్మగారి ఆరోగ్యం కుదుటబడే ఉంటుంది. క్లాస్ ట్వెల్వ్ కి అప్లికేషన్ పెట్టు. వచ్చేవారం తర్వాత ప్రత్యేక శిక్షణా తరగతులు మొదలవుతాయట! అటుతర్వాత రెండు వారాల్లో రిగ్యులర్ స్కూలు ప్రారంభమౌతుందట. ఆల్ ద బెస్ట్," అని ఓదార్చు చేసి పంపించాడు. స్కూలుకు కిశోరవర్మ ప్రతిభవల్ల రావాల్సిన రాష్ట్రస్థాయి ర్యాంక్ రానందుకు అనేకమైన సమస్యలను ఎదుర్కోవాల్సివస్తుందని ఆలోచిస్తూ.

స్కూలు యాజమాన్యం సుదర్శనరావు మీద విరుచుకు పడింది. "కేవలం ఒక్క విద్యార్థి ప్రతిభమీద ఆధారపడితే ఫలితం యిలానే ఉంటుంది. బొంతపాడు పట్టణంలోని వివేకా స్కూలు 99.9, 99.8, 99.7 శాతాలతో రాష్ట్రంలోని మొదటి మూడు స్థానాల్ని కైవసం చేసుకొంది. అసలు మన స్కూలు విద్యార్థులెవరూ 99.0 అందుకోలేకపోయారు. 50 శాతం విద్యార్థులు 80, తొంభైల మధ్య ఊగిసలాడారు. ఎవరిమీద ఈ బాధ్యతను మోపాలి?"

లోపలినుంచి కోపం తన్నుకొస్తున్నా, సుదర్శనరావు నిగ్రహించుకొని నిలకడగా అన్నాడు.

"చాలా ఆశ్చర్యంగా ఉంది, నేననవల్సిన మాటల్ని



మీరంటున్నారు! ఎదురుగా ఉన్నానుకదా, డొంకతిరుగుడుగా మాట్లాడ్డమెందుకు? బాధ్యత నాదేనని నేరుగానే అనండి. పరవాలేదు. అయితే నా మాటలు సావధానంగా వినండి. ఇంకొక నాలుగు రోజుల్లో క్లాస్ ట్వెల్వ్ బోర్డు ఫలితాలు కూడా వస్తాయి. ఆ ఫలితాలని బట్టి అప్పుడేకంగా అనాల్సిన మాటలనడానికి మీకనేకమైన కారణాలు, అవకాశాలూ దొరుకుతాయి.

"నేను ముత్యాలగిరి శారదా జూనియర్ కళాశాలలో 35 సంవత్సరాలు పనిచేసినప్పుడు ఈ రోతపుట్టించే బట్టీ విధానాన్ని ఎప్పుడూ ప్రోత్సహించలేదు. సంవత్సరాంతర స్కూలు పరీక్షల్లో, రాష్ట్రస్థాయి పది, పన్నెండు బోర్డు పరీక్షల్లో విద్యార్థులు తమ గ్రాహ్యశక్తి మీద ఆధారపడి సమాధానాలు రాశారేకాని, బట్టీయం మీద ఆధారపడికాదు. క్రీడాస్థలం కూడా వారికొక తరగతి గదే. పుట్టగొడుగుల్లా ఇంజనీరింగ్ కళాశాలలు, అంత సంఖ్యలో లేకపోయినా చెప్పుకోదగ్గ సంఖ్యలోనే వైద్యకళాశాలలూ పుట్టుకొచ్చాయి, రాష్ట్రస్థాయి, లేదా జాతీయస్థాయి సాంకేతిక, వైద్య కళాశాలల్లో ప్రవేశార్హత సంపాదించే పరీక్షల్లో ముత్యాలగిరి శారదా జూనియర్ కళాశాల విద్యార్థులు అధిక సంఖ్యలో విజయం సాధించి, ఆయా కళాశాలల్లో స్థాయీ ప్రమాణమైన ఫలితాలు సాధించారు. ఉద్యోగాలు సంపాదించారు. వారెవరూ చేతనా, కేశవా ప్రత్యేక శిక్షణాలయాల్లో చేరలేదు. వైద్య, సాంకేతిక కళాశాలల్లో చేరే ఆర్థికపరమైన స్తోమత లేనివారు డిగ్రీ కళాశాలల్లో, తదుపరి విశ్వవిద్యాలయాల్లో చేరి మౌలిక శాస్త్రాలను చదివి కళాశాలల్లో ఉపన్యాసకులుగా చేరుతున్నారు. అయితే స్థాయీ ప్రమాణాలుగల ఇలాంటి ఉపన్యాసకుల పట్ల కళాశాలలు సరైన దృష్టి సారించక. వారి మాటలకి స్పందించక, కంఠస్థమే ఒక ర్యాంకుల నిత్య సాధనంగా అమలుపరచడం మూలాన, విద్యార్థుల జ్ఞానప్రమాణాలు కూడా మితి మీరిన ధారణమార్గానికి పరిమితమైపోయి, పతనం చెంది విద్యారంగమే విషమ పరిస్థితుల్లో కొట్టుమిట్టులాడుతోంది. దౌడు తీసే గెలుపు గుర్రాలకీ అలుపు సొలుపులూ, అవరోధాలూ ఉంటాయి.

"నా గురించి విన్న మీనాయన గారు, నేను పదవీ విరమణ చేసిన ఆరు నెలల క్రితం ఈ హయ్యర్ సెకండరీ స్కూలు హెడ్ మాస్టారుగా చేర్చుకొన్నారు. నేను ఏవిధంగా ముత్యాలగిరి శారదా జూనియర్ కళాశాలని నడిపానో అదేవిధానంలో నడుపుతానని స్పష్టం చేశాను, దానికి మీ నాయనగారు ఒప్పుకొనే నన్ను నియమించారు. చేరిన వెంటనే నా పద్ధతులను ప్రారంభిస్తే సంవత్సరాంతర, బోర్డు పరీక్షల్లో అన్ని తరగతుల విద్యార్థులూ గాడి తప్పి దెబ్బతింటారనీ, కొత్త విద్యాసంవత్సరం మొదలైన తర్వాతనే నా ప్రణాళికను అమలుపరచమని ఆయన చెప్తే దానికి నేనంగీకరించాను. ఎందుకంటే ఆయన విజ్ఞత సత్యదూరం కాదు. అందుకని ఇప్పుడు బోర్డు పరీక్షల్లో విద్యార్థులు తెచ్చుకొన్న మార్కుల శాతాలతో నా ప్రమేయం ఏమాత్రమూ లేదు. కిశోరవర్మ అతని తల్లి అస్వస్థత వల్ల ధ్యాస తప్పిందంటున్నాడు. నాడాలోని ఒక మేకు వదులైతే గుర్రం గతి తప్పు తప్పుతుంది.

"దురదృష్ట వశాత్తు మీ నాయనగారు మూడు నెలల క్రితం కాలధర్మం చెందడంతో మీరు పగ్గాలు చేబట్టారు. మార్కులూ. ర్యాంకులూ లక్ష్యంగానే ముందుకు వెళ్లదల్చుకొన్నారని ఇప్పుడు తెలుస్తోంది. శారదాలో పదవీ విరమణ చేసిన నన్ను మీ నాయన గారు చేర్చుకోవడంతో, ప్రస్తుత వికాస్ సీనియర్ ఉపాధ్యాయులలో ఉన్న అసంతృప్తి కారణంగా మీకు పాలనాపరమైన కొన్ని ఇబ్బందులుండవచ్చు. అదీకాక విద్యార్థులు బట్టీ మార్గం పడితే తమకు విశ్రాంత మార్గం ఉంటుందని కొంతమంది ఉపాధ్యాయులు ఊపిరి పీల్చుకొనే వారుంటారు. ఇంతవరకూ వారి జోలికి నేను వెళ్లలేదు. విద్యాసంవత్సరం మారిన తర్వాత పద్ధతులు మారుద్దామని మట్టుకు చెప్పాం తే!

"నా సలహా తీసుకోకుండా, నా అనుమతి తీసుకోకుండా పదో

తరగతిలోకి వచ్చిన, పదకొండవ తరగతిలో చేరిన,12వ తరగతిలోకి వచ్చిన విద్యార్థులకు, సెలవుల ముందస్తు రెండువారాల సమయంలో రోజుకి ఎనిమిదిగంటల చొప్పున పాఠ్య ప్రణాళికలోని సగశాతం పూర్తయిపోయింది! మరో అంశం ఏమంటే-ఇతర గ్రామాలనుంచి కూడా కొంతమంది 90 ప్లస్ శాతం విద్యార్థినీ ద్యార్థులు కూడా వచ్చి ఇదే కళాశాలలో చేరారు. దానితో ఇక్కడే పదవ తరగతి చదివి బోర్డు పరీక్షల్లో 80 ప్లస్ వచ్చిన విద్యార్థులకు ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశం యివ్వకుండా చేసి, టి.సి లిచ్చేసి పంపించేశారు. ఈ అన్ని నిర్ణయాల్ని నాప్రమేయం లేకుండా, నాకు తెలియకుండా కళాశాల కార్యనిర్వాహక అధ్యక్షులుగా మీరే తీసుకొని, అమలుపర్చేశారు. ఇది సరైన పద్ధతి కాదు. పదవ తరగతి బోర్డ్ పరీక్షల్లో ప్యాసయిన అందరినీ పదకొండులో తీసుకోవాల్సిందే. అది జరగకపోతే నా రాజీనామా పత్రం సిద్ధంగా ఉంది. అటుపైన మీ యిష్టం!" అన్నాడు సుదర్శనరావు.

సోదరులు ముగ్గురూ తలలు పట్టుకొన్నారు. "కళాశాలలో ఉన్న అన్ని తరగతులకు కక్ష్యకు నలభై విద్యార్థులుండే రెండు కక్ష్యలకే అనుమతులున్నాయి. ఇప్పటికే ఇతర పాఠశాలలనుంచి 90 ప్లస్ శాతం వచ్చిన వారిని తీసేసుకొన్నాం. ఖాళీలు లేవు కుదరదు!" అన్నారు ఏకగ్రీవంగా.



"అయితే నేను పని చేసేది లేదు. ఆ విద్యార్థులకు న్యాయం చేయాలంటే మీరు పదకొండవ తరగతికి మరో కక్ష్యకు అనుమతులు తెచ్చుకోండి. మీకు రాజకీయ బలగం ఉందని నాకు తెలుసు. అందుచేత అనుమతులు తీసుకురావడం మీకు సాధ్యమైన పనే. నేను ప్రత్యేకించి మీ కాలేజీని ఉద్ధరించడం కోసం చేరలేదు. విద్యారంగాన్నిమెరుగు పరచడానికి ఉడతాభక్తిగా నా సాయం అందించి, మరో కళాశాలని స్థాయి ప్రమాణాల పరంగా అభివృద్ధిపరచి, బట్టీయంతో ర్యాంకులు సంపాదించే విద్యార్థులు-విద్యాలయాల స్థాయికి సూచికలు కాలేరని నిరూపించడమే.ఇదేకీర్తిశేషులైన మీ నాయనగారు నానుంచి ఆశించినది. ఈ సత్యాన్ని విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యాలయాధికారులు గ్రహించిన నాడు మన విద్యా విధానం పూర్వ వైభవాన్ని సంతరించు కొంటుంది. ఆలోచించండి."

వాళ్ళు ముగ్గురూ మౌనంగా ఉండిపోయి ఒకరి మొహాలు మరొకరు చూస్తూ ఉండిపోయారు. సుదర్శనరావు డ్రాయరు సొరుగులో సిద్ధంగా ఉంచుకొన్న రాజీనామా పత్రాన్ని వారిముందు బల్లమీద పెట్టి నిష్క్రమించాడు.

పదకొండవ తరగతిలో ప్రవేశం లభించని పదవతరగతి ప్యాసయిన అదేస్కూలు విద్యార్థుల తల్లిదండ్రులు కోర్టు గుమ్మాలు తొక్కారు. నిర్ణయం ఎప్పుడొస్తుందో మరి?

***

# సంభాషణ సంస్కృతం



దుర్గాప్రసాదరావు

विशेषणविशेष्यभाव:    **విశేషణవిశేష్యభావం**

**సంస్కృతభాషలో ఒక నియమం ఉంది . అదేంటంటే విశేష్యం ఏ లింగం , ఏ వచనం , ఏ విభక్తులలో ఉంటుందో విశేషణం కూడ అదే లింగం అదే వచనం అదే విభక్తులలో ఉండాలి  యల్లింగం యద్వ-చనం యా చ విభక్తి: విశేష్యస్య తల్లింగం తద్వచనం సా చ విభక్తి: విశేషణస్యాపి**
**Generally an adjective qualifies noun or a pronoun in a sentence. Normally adjectives have no definite gender. They are used in accordance with the gender of the noun or pronoun.  In Sanskrit Grammar there is complete declension for all adjectives quite in accordance with the noun or pronoun. Here is the rule:** यल्लिङ्गं यद्वचनं या च विभक्ति: विषेष्यस्य तल्लिङ्गं तद्वचनं सा च विभक्ति: विशेषणस्यापि **which means that the noun and the adjective should be in the same gender, same number and same case. If the noun is in masculine gender the adjective is also in masculine. If the noun is in singular number the adjective is also in singular. Similarly if the noun is in nominative case the adjective is also in the nominative case. This rule is applicable even for numerical words also.**

विशेषणविशेष्यभाव: **in three genders:**

| पुंलिङ्ग: | स्त्रीलिङ्ग: | नपुंसकलिङ्ग: |
|---|---|---|
| रम्य: राम: - | रम्या सीता – | रम्यं वनम् |
| **రమ్య: రామ:** | **రమ్యా సీతా** | **రమ్యం వనం** |
| सुन्दर: बालक: - | सुन्दरी बालिका – | सुन्दरं पुस्तकम् |
| **సుందర: బాలక:** | **సుందరీ బాలికా –** | **సుందరం వనం** |
| रमणीय: वृक्ष: - | रमणीया लता – | रमणीयं पुष्पम् |
| **రమణీయ వృక్ష: -** | **రమణీయా లతా –** | **రమణీయం పుష్పం** |
| कमनीय: ग्रन्थ: - | कमनीया कथा – | कमनीयं काव्यम् |
| **కమనీయ: గ్రంథ:** | **కమనీయా కథా** | **కమనీయం కావ్యం** |
| चतुर: कथक: -- | चतुरा नटी – | चतुरं प्रदर्शनम् |

**సెల్ 91333 20425**

చతురః కథకః                చతురా నటీ                చతురం ప్రదర్శనం

विशेषणविशेष्यभाव: **in three genders, three numbers and seven case.**

पुंलिङ्ग**: (masculine gender)**

विभक्ति :                एकवचनम्        द्विवचनम्            बहुवचनम्

प्रथमा --        सुन्दर: बालक: -  सुन्दरौ बालकौ -        सुन्दरा: बालका:

संबोधन प्रथमा-- हे सुन्दर बालक ! * हे सुन्दरौ बालकौ * हे सुन्दरा: बालका:

द्वितीया --        सुन्दरं बालकं *      सुन्दरौ बालकौ *        सुन्दरान् बालकान्

तृतीया --      सुन्दरेण बालकेन*  सुन्दराभ्यां बालकाभ्याम् *   सुन्देरेभ्य: बालकेभ्य:

चतुर्थी--     सुन्दराय बालकाय * सुन्दराभ्यां बालकाभ्याम् *   सुन्दरेभ्य: बालकेभ्य:

पञ्चमी--   सुन्दरात् बालकात्* सुन्दराभ्यां बालाकाभ्याम् *  सुन्दरेभ्य: बालकेभ्य:

षष्ठी--     सुन्दरस्य बालकस्य*  सुन्दरयो: बालकयो:*       सुन्दराणां बालकानाम्

सप्तमी-सुन्दरे बालके* सुन्दरयो: बालकयो: -सुन्दरेषु बालकेषु

स्त्रीलिङ्ग**: (feminine gender)**

विभक्ति:   एकवचनम्        द्विवचनम्            बहुवचनम्

प्रथमा:-   सुन्दरी बालिका ||  सुन्दर्यौ बालिके ||        सुन्दर्य: बालिका:

सं || प्रथमा:-  हे सुन्दरि बालिके || हे सुन्दर्यौ बालिके || हे सुन्दर्य: बालिका:

द्वितीया:-  सुन्दरीं बालिकाम् || सुन्दर्यौ बालिके ||      सुन्दर्य: बालिका:

तृतीया:-  सुन्दर्या बालिकया || सुन्दरीभ्यां बालिकाभ्याम् || सुन्दरीभि: बालिकाभि:

चतुर्थी:-  सुन्दर्यै बालिकायै || सुन्दरीभ्यां बालिकाभ्याम् || सुन्दरीभ्य: बालिकाभ्य:

पञ्चमी:- सुन्दर्या: बालिकायै || सुन्दरीभ्यां बालिकाभ्याम् || सुन्दरीभ्य: बालिकाभ्य:

षष्ठी-  सुन्दर्या: बालिकाया: || सुन्दर्यो: बालिकयो: ||     सुन्दरीणां बालिकानाम्

सप्तमी- सुन्दर्यां बालिकायाम् || सुन्दर्यो: बालिकयो: ||    सुन्दरीषु बालिकासु

नपुंसकलिङ्ग: **(Neuter gender)**

विभक्ति:        एकवचनम्        द्विवचनम्            बहुवचनम्

प्रथमा   सुन्दरं  पुस्तकम्  * सुन्दरे पुस्तके *                सुन्दराणि पुस्तकानि

द्वितीया सुन्दरं  पुस्तकम्  * सुन्दरे पुस्तके *                 सुन्दराणि पुस्तकानि

तृतीया -- सुन्दरेण पुस्तकेन * सुन्दराभ्यां पुस्तकाभ्याम्  * सुन्दरै: पुस्तकै:

चतुर्थी-- सुन्दराय पुस्तकाय * सुन्दराभ्यां पुस्तकाभ्याम् * सुन्दरेभ्य: पुस्तकेभ्य:

पञ्चमी-- सुन्दरात् पुस्तकात् * सुन्दराभ्यां पुस्तकाभ्याम् * सुन्दरेभ्य: पुस्तकेभ्य:

षष्ठी-- सुन्दरस्य पुस्तकस्य* सुन्दरयो: पुस्तकयो: * सुन्दराणां पुस्तकानाम्

सप्तमी -- सुन्दरे पुस्तस्के * सुन्दरयो: पुस्तकयो: * सुन्दरेषु पुस्तकेषु

| | | |
|---|---|---|
| पुंलिङ्ग: | स्त्रीलिङ्ग: | नपुंसक लिङ्ग: |
| एक: | एका | एकम् |
| एक: बालक:- | एका बालिका | एकं पुस्तकम् |
| एक: वृक्ष: | एका लता | एकं पुष्पम् |
| एक: चमस: | एका दर्वी | एकं पात्रम् |
| एक: पुरुष: | एका महिला | एकं मन्दिरम् |
| एक: समुद्र: | एका नदी | एकं सर: |

**Example:-** एक: बालक: एका बालिका च एकं पुस्तकं पठत:

| | | |
|---|---|---|
| द्वौ | द्वे | द्वे |
| द्वौ बालकौ | द्वे बालिके | द्वे पुस्तके |
| द्वौ वृक्षौ | द्वे लते | द्वे पत्रे |
| द्वौ पुरुषौ | द्वे महिले | द्वे वाहने |

**Example:** द्वौ बालकौ द्वे बालिके गृहीत्वा पाठशालां गच्छन्ति

| | | |
|---|---|---|
| त्रय: | तिस्र: | त्रीणि |
| त्रय: युवका : | तिस्र: वनिता: | त्रीणि पुस्तकानि |
| त्रय: वृक्षा: | तिस्र: लता: | त्रीणि पत्राणि |
| त्रय: क्रीडाकारा: | तिस्र: क्रीडाकारिण्य: | त्रीणि कन्दुकानि |

**Example:** त्रय: युवका:, तिस्र: वनिता: त्रीणि कन्दुकानि गृहीत्वा क्रीडाङ्गणे क्रीडन्ति

| | | |
|---|---|---|
| चत्वार: | चतस्र: | चत्वारि |
| चत्वार: पुरुषा: - | चतस्र: महिला: - | चत्वारि फलानि |
| चत्वार: बालका: | चतस्र: बालिका: | चत्वारि पुष्पाणि |
| चत्वार: पर्वता: | चतस्र: नद्य: | चत्वारि सरांसि |

**Example:** चत्वार: बालका:, चतस्र: बालिका: च चत्वारि फलानि देवाय समर्पयन्ति

**From five the forms are the same in all genders:**

| | | |
|---|---|---|
| पञ्च | पञ्च | पञ्च |
| पञ्च बालका: | पञ्च बालिका: | पञ्च पुस्तकानि |

पञ्च बालका: पञ्च बालिका: च पञ्च पुस्तकानि गृहीत्वा ग्रन्थालयं गच्छन्ति

# కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వరుడు

ప్రతీ జీవుడు తాను చేసు కున్న పాప పుణ్యాల ఫలితం గా 84 లక్షల జీవరాశులలో ఏదో ఒక జన్మ ఎత్తి తీరాలి అని పురాణాలు తెలియజేస్తున్నాయి .పాప పుణ్యాలు రెండింటి కీ చావు పుట్టుకలు తప్పవు. పాప పుణ్యాలు రెండూ నశిస్తేనే మోక్షం . మోక్షం అంటే ఆత్మ కు చావు పుట్టుకలు లేకుండా పరమాత్మ శ్రీ మన్నా రాయణుని చెంతకు చేరడం. శ్రీమన్నారాయణుని కోరుకుంటే జీవునికి చావు పుట్టుకలు లేని మోక్షాన్ని ఇస్తాడని ధర్మశా స్త్రములు తెలియ జేస్తున్నాయి. .

కలియుగం లో అధర్మం మూడు పాదాలకు పెరిగిన కారణంగా స్వామి అసలు భూమి పైన అవత-రించ రాదని భావిం చారు.అయితే బృగు మహర్షి కలిలో ఎవరిని ఆరాధించాలో గుర్తించి మనకు తెలియజేయాలని త్రిమూర్తులైన బ్రహ్మ ,శివులను పరీక్షించి శపించి అక్కడి నుండి పాలకడ-లి చేరి శ్రీ మన్నా రాయణుని దర్శించగా లక్ష్మీదేవి స్వామి పాదాలు సేవిస్తూ ఉంటే స్వామి ఆదమరచి నిద్రిస్తున్న ట్లుగా బృగు మహర్షి భావించి కోపంతో స్వామి వక్షస్థలం పై ఒక్క తన్ను తన్నాడు.అయినా స్వామి కోపించి శిక్షించ కుండా బృగు మహర్షి ని గౌరవించి ఆదరించగా బృగు మహర్షి కలియుగం లో శ్రీ మన్నారాయణుని ఆరాధించుట వల్ల మంచి ఫలితం పొందవచ్చు అని తీర్మానించారు.కాని స్వామి చేసిన పనికి లక్ష్మీదేవి కోపించి స్వామిని విడిచి కొల్హాపూర్ (కరవీర పురం) వెళ్ళి పోయింది.స్వామి చివరకు తిరుమల తిరుపతి కొండగా పిలిచే "వరాహ నరసింహ స్వామి" కొండ చేరి కొన్ని షరతులతో కూడిన వరాహ నరసింహ స్వామి అనుమతు లతో ఆకొండపైన స్వామే ప్రత్య క్షంగా శ్రీ వేంకటేశ్వరు-డుగా మకాం పెట్టడం జరిగింది.ఈవిషయం అందరికీ తెలిసిన విషయం గాన పెద్దగా వివరించ లేదు. తెలియని విషయాలు చాలా ఉన్నాయి వాటిని తెలుసు కునే ప్రయత్నం చేద్దాం.

వేంకటాచల మహత్యాన్ని భవిష్యత్ పురాణం, బ్రహ్మ పురాణం,స్కాంద పురాణం,వరాహ,వామన పురా-ణములు గరుఢ, మార్కండేయ పురాణములు,హరివంశములలో వివరించ బడి ఉంది.భగవంతుని అనుగ్రహం తో తెలుసుకునే ప్రయత్నం చేద్దాం..................

ముంబై వేంకటాచార్యులు ,యం,ఎ.,యం,ఇడి.,

---

త్రేతాయుగమున" కేసరి"అను రాక్షసుడు రుద్రుని గూర్చి గొప్ప తపస్సు ప్రారంభించాడు.అతడు పూర్తిగా ఇంద్రియాలను రుద్రుని పై నిలిపి కఠోర దీక్షతో రుద్రుని అనుగ్రహము నకై తపస్సు కొ-నసాగించగా రుద్రుడు ప్రత్యక్షమై వరం కోరుకోమన్నాడు

మంచి ,ధైర్యం ,బలం, యుద్ధం లో వెన్ను చూపని గొప్ప పరా-క్రమము, ధర్మా నికి సహ రించే సేవా గుణం వంటి మంచి లక్ష-ణాలు గల కుమారుడు కావాలి అంటే రుద్రుడు కేసరి నుదురు మీద గల గీతలను పరిశీలించి బ్రహ్మ నీకు ఈ జన్మలో కుమారుని ప్రసాదించే విధంగా వ్రాయలేదు గాన నీ కు ఆడపిల్ల పుడుతుంది ఆమెకు కుమారుడు కలగడం ద్వారా నీ కోర్కె నెరవేరుతుంది అని వరం ఇచ్చారు.

కొంతకాలానికి "కేసరికి "పుం-జకస్థల" అనే అప్సరస శాపం కారణంగా "అంజనాదేవి"అనే "వానర స్త్రీ "గా అవతరించింది. ఒకప్పుడు ఈమె ఇంద్రుని కొలువు లో ఉండే అప్సరస ఆమె ఒక నాడు బ్రహ్మ ఎదురుగా నృత్యం చేస్తుంటే పాటకు అనుగుణంగా అడుగులు వేయని కారణంగా "వానరస్త్రీ "గా మారమని శపిం-చాడు.ఆ అప్సరస బ్రాహ్మ గారి పాదాలపై పడి దుఃఖిస్తూ నన్ను క్షమించమని ప్రాధేయ పడు తుంటే బ్రహ్మ గారు ఆమె తో నీవు వాన ర స్త్రీ గా ఉన్నప్పుడు నీకు పుట్టబోయే బిడ్డ మంచి కీర్తి ప్ర-తిష్టలతో ఈభూమి పై ఆరాధింప బడుతూ. చిరంజీవి అవుతాడు.

నీకు గొప్ప కీర్తి లభిస్తుంది.అంటే ఆమె అంగీకరించి వానరస్త్రీ గా అవతరించి.ఆమె కు యుక్త వయస్సు రాగా నే తండ్రి ఆమెకు కేసరి (ఇతని కే "కుంజరుడు "అనే మరొక పేరు ఉన్నదని ఒక పురాణం చెబుతోంది) అనే మరి యొక వానరునకు ఇచ్చి వివాహం చేశాడు.వారి సంసారం చక్కగా కొనసాగుతోంది .అయితే ఆ దంపతులకు సంతానం కలగలేదు.అంజన గుళ్ళు,గోపురాలు అన్నీ తిరుగు తోంది .పెద్దలను సేవించు కుంటూ వారు. చెప్పి న సలహాలన్నీ పాటిస్తూ , చెప్పిన పూజలన్నీ క్రమంతప్ప కుండా నిర్వహించేది. అయినా ఫలించలేదు .ఒక రోజు ఒక "సోదికత్తె"తన ఇంటికి రాగా ఆమె కు రత్నాలు కలిసిన బియ్యం ఒక చేటు లో పోసి అందించగా నీవు తిరుమల తిరుపతి కొండపై తపస్సు చేసిన పండంటీ బిడ్డ నీకు జన్మిస్తాడని ఇది సత్యమని తలియజేసింది. దాంతోఅంజన తన భర్తను తీసుకొని తిరుమల తిరుపతి కొండ పైకి. చేరింది. ఆమె కు మాతంగమహర్షి అనుగ్రహం లభించింది.ఆమె ఆస్వామి కి పాదాభివందనం చేయగా ఆమహర్షి "శ్రీ ఘ్రుమేవ సుపుత్ర ప్రాప్తి రస్తు". అని ఆశీర్వదించి నీవు ముందుగా స్వామి పుష్కరిణిలో స్నానం చేసి ఉత్తరాన ఉన్న ఆకాశగంగ లో కూడా స్నానం చేసి వాయుదేవుని అనుగ్రహం కొరకు ఈ కొండ పైన నీవు తపస్సు చేయాలి నీవు శ్రద్ధ తో చేసే తపస్సు తప్పక ఫలిస్తుం-



దని చెప్పి మరల ఆశీర్వదించి వెళ్ళిపోయారు .ఆ కొండ పై అంజనాదేవి గొప్ప తపస్సు చేయగా ఆ తపస్సు ఫలించి వాయుదేవుని అనుగ్రహంతో ఒక కుమారుడు అవతరించాడు అతడు పుట్టిన రోజుననే సూర్యగ్రహణం గాన సూర్యుడు హనుమ కుఎర్రని పండులా కనిపించడం తో ఆపండు తెచ్చుకోవాలని ఎగురుతూ సూర్యుని చెంతకు వెళ్ళాడు అక్కడ రాహుగ్రహణం గాన రాహువు సూర్యుని మ్రింగాలని దగ్గరకు వెళుతున్నాడు. తాను కోరుకున్న సూర్యుడు అనే పండును రాహువు తినేస్తా డని భావించి హనుమ అతనిని బెదిరించగా రాహువు వెళ్ళి ఇంద్రుని తో చెప్పగా ఇంద్రుడు ఆ పిల్లవానిని చూసి వజ్రాయుధం తోమోదాడు హనుమ నేలపై పడ్డాడు .ఆసమయం లో నేలపై పడిన హనుమ ను అంజన తీసుకుని తన కుమారుడు మరణించాడని భావించి దుఃఖిస్తూ వాయుదేవుని ప్రార్థించగా వాయువు తన కుమారుని ఎత్తుకుని అంజన తో కలిసి ఒక గుహ లోకి వెళ్ళి ఒక పెద్ద రాయి గుహకు అడ్డు పెట్టు కున్నాడు.దాంతో భూమి పై గాలి స్తంభించి పోయింది. గాలి తో బ్రతికే జీవులు అన్నీ గాలిలేక అంతా మరణించే దశకు దగ్గరపడు తింటుంటే. బ్రహ్మాది దేవత లంతా అక్కడికి వచ్చి చరి వాయుదేవా హనుమ చనిపోయేవాడు కాదు భవిష్యత్ లో చిరంజీవి అవుతాడు నా బ్రహ్మాస్త్రం తో బంధింపబడి నా హనుమ కోరు కుంటే పట్టు వదిలేస్తుంది.సూర్యుడునావల్లనే ఇలా జరింగింది గాన నా తేజస్సు లో 1/100 భాగం అతనికి ఇస్తున్నా అతడు కోరు కుంటే విద్య నేనే అందిస్తా అన్నాడు.ఇలా దేవత లందరూ తలో వరం హనుమ కు ఇచ్చారు.

# తెలుగు సాహిత్య చరిత్ర



తుమ్మూరి రాంమోహనరావు

## తిక్కన యుగము

ఈ యుగంలో తెలుగులో తొలిరామాయణం వ్రాసిన గోనబుద్ధారెడ్డి , మహా భారతం పదిహేను పర్వాలు రాసిన తిక్కన సోమయాజి ప్ర-ముఖులు.గోనబు ద్ధారెడ్డి కాకతీయులకు సామంతరాజు. కందూరు రాజధానిగా పరిపాలన చేసా డు.తండ్రి రంగనాథుని పేర రామాయణం యుద్ధకాండ వరకు ద్విపదలో రచించాడు. మిగతాభాగాన్ని కుమారులు కాచ, విఠల నాథులు పూర్తి చేసారు.కోన బుద్ధారెడ్డి ద్విపద మాధుర్యం ఎలాంటిదా మరి చూడండి.

"అదరకు భూదేవి యాత్రలో నీవు

చెదరి చలించకు శేషాహి నీవు

కడఁక ధరింపుము కమఠేంద్ర నీవు

కడునేమరుకుడు దిక్కరులారమీర

లేని యని పల్కగ నా మేటి విల్లు

గొనయమెక్కించి గైకొనక రాఘవుడు

తన బాహు సత్వంబు దర్పంబు మెఱసి

జనకునికనియె నా చాపంబు చూచి

ఇది చాల చులకన యిది చాల బ్రాత

శివధనుర్భంగ సందర్భము-

ఈ యుగంలోనే కవిత్రయంలోని రెండవవాడైన తిక్కన సోమయాజి నెల్లూరులోకి మనుమసిద్ధి వద్ద ఒక వైపు అమాత్యుడిగా మరొకవైపు ఆస్థాన కవిగా ఉండి అరణ్యా పర్వ శేషము తప్ప భారతంలోకి మిగతా పదిహేను పర్వాలను పూర్తి చేసి పేరుపొందాడు.ఈయనకు కవిబ్ర-హ్మ మరియు ఉభయకవి మిత్రుడు అనే బిరుదాలు కలిగిఉండటమేగాక యజ్ఞము నిర్వహించి సోమయాజి అయ్యాడు.

తిక్కన విరాట పర్వము మొదలుకొని స్వర్గారోహణ పర్వందాకా పదిహేను పర్వాలు రచించాడు.ఆదిపర్వము , సభాపర్వము,ఆరణ్యప-ర్వము,విరాటపర్వము, ఉద్యోగపర్వము,భీష్మపర్వము,ద్రోణపర్వము,కర్ణపర్వము,శల్యపర్వము,సౌప్తికపర్వము,స్త్రీపర్వము,శాంతిపర్వము, అనుశాసనికపర్వము,అశ్వమేధపర్వము, ఆశ్రమ వాసపర్వము ,మౌసలపర్వము,మహాప్రస్థానికపర్వము, స్వర్గారోహణ పర్వము అని మొత్తము భారతంలో పద్దెనిమిది పర్వాలు.అందుకే ఆయనను మహాకవి తిక్కన అనటం కూడా పరిపాటి.భారతమే కాక తిక్కన నిర్వచ-నోత్తర రామాయణం కూడా రచించాడు.
తిక్కన ప్రారంభ పద్యం:

ఉత్పలమాల:

శ్రీయన గౌరినాఁబరగు చెల్వకు చిత్తము పల్లవింప భ

ద్రాయత మూర్తియై హరిహరంబగు రూపముఁదాల్చి విష్ణురూ

పాయ! నమఃశివాయ! యని మ్రొక్కెడు భక్త జనంబు వైదిక

ధ్యాయిత కిచ్చు మెచ్చు పర తత్త్వముఁ గొల్తు నభీష్ట సిద్ధికిన్;

శార్దూలము:

దుర్వారోద్యమ బాహు విక్రమ రసాస్తోక ప్రతాప స్ఫురత్

గర్వాంధ్య ప్రతివీర నిర్మథన విద్యా పారగుల్ మత్పతుల్,

గీర్వాణాకృతు లేవురిప్డు నిను లీలం వేసం గట్టి గం

ధర్వుల్ మానముఁ బ్రాణముం దొనుట తథ్యం బెమ్మెయిన్ కీచకా! -

చంపకమాల:

వరమునఁబుట్టితిన్ భరత వంశముఁ జొచ్చితి, నందు పాండుభూ

వరునకుఁ గోడలైతి, జనవంద్యులఁ బొందితి , నీతి విక్రమ

స్థిరులగుఁ బుత్రులం బడసితిన్, సహజ న్ములఁ బ్రాపుఁ గాంచితిన్;

సరసిజనాభ! యిన్నిటఁ, బ్రసిద్ధికి నెక్కిన దాన నెంతయున్;

కందము

ఒరులేయవి యొనరించిన

నరవర ! యప్రియము తన మనంబునకగు తా

నొరులకవి సేయకునికియె

పరాయణము పరమ ధర్మ పథముల కెల్లన్ -విదురనీతి

(ఇంకా ఉంది)

# తృప్తిపడ్డ మనసు

~పెండ్యాల నళినీకుమార్



వందన చాలా రోజుల తర్వాత విశాఖపట్నం వెళ్లడానికి సిద్ధమై వెళుతోంది. క్యాబ్ బుక్ చేసుకుని సికింద్రాబాద్ స్టేషన్ కి వెళ్ళింది. ట్రైన్ రావడానికి ఇంకా టైం ఉంది ట్రాఫిక్ జామ్ ఉంటుందేమో రిస్క్ తీసుకోవడం దేనికని తొందరగా వచ్చేసింది స్టేషన్ కి. అక్కడే ఒక బెంచీ మీద కూర్చుంది.

ఈలోపు వందనకి వెనకనుంచి "వందన" అని ఎవరో పిలిచినట్టు వినిపించింది. వెనక్కి తిరిగి చూసేసరికి, అక్కడ కనిపిస్తున్న వ్యక్తిని చూసి తన కళ్ళని తానే నమ్మలేకపోయింది. మాధవి ఇలా! ఇక్కడ! ప్రత్యక్షమైందేమిటి? అని అనుకుంటూ "మాధవి నువ్వా? ఇక్కడా? ఇలా? నమ్మలేకపోతున్నా! హైదరాబాద్ ఎప్పుడు వచ్చావు? ఎలా ఉన్నావు? ఎందుకు వచ్చావు?" అని ప్రశ్నలు అన్నీ ఒకేసారి అడిగేసింది.

మాధవి నవ్వుతూ నీ ప్రశ్నలు అయ్యాయా.? మేము హైదరాబాద్ ఒక పెళ్ళికి వచ్చాము. సరే, రా అలా కూర్చుని మాట్లాడుకుందాం అంది. ఇద్దరూ కలిసి వెయిటింగ్ రూమ్ లోకి వెళ్లారు. రూమ్ లోకి రాగానే మాధవి పిల్లలు "అమ్మ! ఈ ఆంటీ ఎవరు?" అని అడిగారు. "నా స్నేహితురాలు వందన అని చెప్తాను కదా, ఆ ఆంటీ."

అంటూ తన పిల్లలిద్దరినీ వందనకి పరిచయం చేసింది. "నా కూతురు మనోజ్ఞ, కొడుకు అభిషేక్" అని చెప్పింది మాధవి. "నువ్వు ఎప్పుడూ చెప్తూ ఉంటావు కదా అమ్మ ఈ ఆంటీ గురించేనా" అన్నారు పిల్లలు ఇద్దరు. పిల్లల్ని చూసిన వందన "ఎంత ముద్దుగా ఉన్నారో.అచ్చం మాధవి, నీ పోలికే." అంటూ ఆప్యాయంగా ముద్దు పెట్టుకుంది.

ఇంతలో మాధవి భర్త అక్కడికి వచ్చి "నమస్కారం వందన గారు. ఎన్నాళ్ళు అయ్యింది మిమ్మల్ని చూసి, మీరు ఒక్కరే వచ్చారా? మీవారు శరత్ గారు బాగున్నారా? ఆయన రాలేదా" అని అడిగాడు మాధవి భర్త సిద్ధార్థ. "ఆ బానే ఉన్నారు. నేను పని మీద వైజాగ్ వెళుతున్నాను" అంది వందన.

"సరే సిద్దార్థ మమ్మల్ని కాసేపు వదిలేస్తే మాట్లాడుకుంటాం. పాతిక సంవత్సరాలు అయింది కలిసి" అంది. అది విన్న పిల్లలు ఆశ్చర్యపోతూ "25 ఇయర్స్! ఓ మై గాడ్! మాట్లాడుకోండి మేము నాన్నగారితో కలిసి అక్కడ కూర్చుంటాం" అని ముగ్గురు వేరే చోటికి వెళ్లి కూర్చున్నారు. "ఆ ఇప్పుడు చెప్పవే వందన, ఏమయ్యావు ఇన్ని సంవత్సరాలు? నేను రాసిన ఉత్తరాలకి, నీ దగ్గర నుంచి ఒక్క దానికి సమాధానం లేక నేను రాయటం మానేశా. ఇంతకీ ఎక్కడికి వెళ్తున్నావు?" అని మాధవి అడిగింది. "విశాఖపట్నం వెళ్తున్నానే. మా అమ్మాయి మానస అత్తగారికి ఆపరేషన్ అయింది. నా కూతురు ఆస్ట్రేలియాలో ఉంది అందుకే ఆవిడని చూడటానికి వెళుతున్నా. మరి మీరు?" అంది వందన. "మేము రాజమండ్రిలోనే ఉంటున్నాం. హైదరాబాద్ పెళ్లికి వచ్చి మళ్ళీ రాజమండ్రి వెళ్తున్నాం. ఇంతకీ నువ్వు ఏ ట్రైన్ కి వెళ్తున్నావు?" "గోదావరి కి వెళ్తున్నా మాధవి." "ఓ! గుడ్. మేము ఆ ట్రైన్ కే వెళ్తున్నాం."

"నిజంగా చాలా ఆశ్చర్యంగా ఉందే ఇలా కలవడం. ఈ రోజుల్లోలా మనకి ఫోన్లు ఉండి ఉంటే, ఈ దూరం మన మధ్య ఉండేది కాదు కదా" అంది మాధవి. "నిజమేలే!" నిట్టూర్చింది వందన.

ఒక్కసారిగా వందన మనస్సు గతంలోకి వెళ్ళింది. చదువుకునే రోజుల్లో మాధవి, వందన, అను బెస్ట్ ఫ్రెండ్స్. డిగ్రీ చదువుతూ ఉండగానే మొదట అనుకి పెళ్లి అయ్యి, బెంగళూరు వెళ్ళిపోయింది. కానీ వాళ్ళ అమ్మ వాళ్ళు రాజమండ్రిలోనే ఉండటం వల్ల

అప్పుడప్పుడు వచ్చేది. వచ్చినప్పుడు ముగ్గురు కలిసే వారు. డిగ్రీ అయ్యాక వందన నాన్నగారు రిటైర్ అవ్వటంతో గుంటూరు వెళ్లిపోయారు. వెళ్లిన మూడు నెలలకే వందనకి మంచి సంబంధం వచ్చి శరత్ తో పెళ్లి అయింది. ఆ పెళ్ళికి మాధవి అను ఇద్దరూ వచ్చారు. తర్వాత మాధవి పెళ్లి అయినప్పుడు వందన వెళ్ళింది. అదే మాధవిని చూడటం ఆ తర్వాత వందన భర్త శరత్ తో హైదరాబాద్ వచ్చేసింది.

హైదరాబాద్ వచ్చాక వందన ఇంట్లో అత్తగారు, మామగారి తోనే పని సరిపోయేది. తర్వాత పిల్ల పుట్టడంతో ఇటు పిల్లని చూసుకుంటూ, అటు అత్తమామల్ని చూసుకుంటూ, అదే లోకం అయిపోయింది వందనకి. ఏ లోటు లేకపోయినా, ఏదో కోల్పోయిన ఫీలింగ్ మాత్రం ఎప్పుడూ ఉండేది వందనకి.

ఇంతలో మాధవి "ఏంటే! వందన, పక్కన నేను ఉన్నా ఏంటో ఆలోచిస్తున్నావు?" అని అడిగేసరికి చిరునవ్వు నవ్వి "ఏమీ లేదే. ఏవో జ్ఞాపకాలు బుర్రలో తిరిగాయి" అంది. "సరే నువ్వు మాతో రాజమండ్రిలో దిగి రెండు రోజులు ఉండి వైజాగ్ వెళుదూ గాని" అన్న మాధవి తో "ఇప్పుడు రాలేనులే రిటర్న టికెట్ కూడా బుక్ అయిపోయింది. ఇంకోసారి రెండు రోజులు ఏంటి, వచ్చి వారం రోజులు ఉంటా, సరేనా?" అంది.

ఈలోపు ట్రైన్ ఎనౌన్స్మెంట్ వినిపించింది. "ఓ! ట్రైన్ వచ్చేస్తోంది. ఇంతకీ నీ కోచ్ నెంబర్ ఎంత?" అడిగింది మాధవి. "S6" అంది వందన. "మాది S5. సరే, నువ్వు మా కోచ్ లో ఎక్కేసేయ్ తర్వాత చూద్దాం" అంది. వందన లగేజ్ ను కూడా పిల్లలు తీసుకుని అందరూ గబగబాట్రైన్ ఎక్కారు.

ట్రైన్ బయలుదేరింది ఈ లోపు అభిషేక్ వచ్చి "ఆంటీ! మీ టికెట్టు నాకు ఇవ్వండి. మీ సీట్ లో నేను కూర్చుంటా. మీరు అమ్మ దగ్గరే కూర్చుని, హాయిగా మాట్లాడుకోండి" అన్నాడు. ఇక స్నేహితురాళ్ళు ఇద్దరు పరిసరాలు మర్చిపోయి ఎన్నెన్నో కబుర్లు చెప్పుకున్నారు. కానీ తనివి తీరడం లేదు. ఇక వందనకు అయితే ఆనందంతో మనసు నిండిపోయింది.

"మాధవి, నీకు గుర్తుందా? రోజు సాయంత్రం 6:00 అయ్యేసరికి గోదారి గట్టుకు వెళ్లి, అక్కడ ఇస్కాన్ మందిరం చూసి, వెనకాల గౌతమీ ఘాట్ దగ్గర కూర్చుని, మరమరాల మిక్చర్ తింటూ, కబుర్లు చెప్పుకున్న రోజులు. ఆ గోదావరిని చూస్తూ అక్కడ కూర్చుంటే, ఆ నీటిపై నుండి వచ్చే చల్లగాలికి మనసు ఎంతో ఆహ్లాదంగా ఉండేది. అక్కడి నుంచి రావాలనిపించేది కాదు. ఎనిమిది గంటలకి ఇంటికి వెళ్లే వాళ్లం కదూ!" అంది వందన .ఆ మాటలకి మాధవి "అవి మర్చిపోయే రోజులా?" అనుకుంటూ స్నేహితురాళ్ళు ఇద్దరూ ఎంతో పరవశానికి లోనయ్యారు.

ఇంతలో సిద్ధార్థ వచ్చి నవ్వుతూ, "మీ ఇద్దరి ముచ్చట్లు ఇప్పుడు అయ్యేటట్టు లేవుగాని! టైం 9 అయింది, తిండి కార్యక్రమం పూర్తిగానిచ్చి తర్వాత మాట్లాడుకుందురుగాని" అన్నాడు. తెచ్చుకున్న పార్సిల్లు ఓపెన్ చేసి అందరూ తిన్నారు. అభిషేక్ 'గుడ్ నైట్' చెప్పి వందన సీట్ కి తాను వెళ్ళాడు. ఇక ఇద్దరూ సైడ్ బెర్త్ మీద కూర్చుని కబుర్లలో మునిగిపోయారు. "అవును మాధవి మనం ఇద్దరం అనుకోకుండా బానే కలిశాం. అను ఎక్కడ ఉందో? అది కూడా కలిసి ఉంటే చాలా బాగుండేది" అనుకున్నారు ఇద్దరు.

అలా ఎన్నో అనుభూతుల్ని ఇద్దరు గుర్తు చేసుకుంటూ మనసు విప్పి మాట్లాడుకున్నారు. టైం ఎంతయిందో కూడా తెలియలేదు. కొవ్వూరు స్టేషన్ వచ్చిందని రైల్వే అనౌన్స్ మెంట్ తో ఈ లోకంలోకి వచ్చారు ఇద్దరు. తర్వాతి స్టేషన్ రాజమండ్రి నే.

ప్రియనేస్తాలకి మళ్లీ విడిపోతున్నామని బాధ. ఒకరి ఫోన్ నెంబర్ ఒకరు తీసుకున్నారు. ఈలోపు సిద్ధార్థ లగేజ్ అంతా సర్ది రాజమండ్రిలో దిగడానికి సిద్ధంగా ఉన్నాడు. వందన మాధవి చెయ్యి పట్టుకుని "మళ్లీ ఎప్పుడు కలుస్తామే!" అని బెంగగా

చూసింది. మొదటినుంచి వందనకి కొంచెం ఆప్యాయత ఎక్కువ. మాధవి వందనని దగ్గరికి తీసుకుని "ఇన్ని రోజులు అంటే ఏ విధమైన కాంటాక్ట్స్ లేక దూరమయ్యాంగాని, ఇక ఎప్పటికీ ఆ పరిస్థితులు రావు సరేనా అంది."


"నేను వీలు చూసుకుని మళ్ళీ హైదరాబాద్ వస్తాను" అని చెప్పి, ట్రైన్ ఆగిన వెంటనే మాధవి వాళ్ళు దిగారు. మాధవి కనుమరుగయ్యే వరకు ట్రైన్లో నుంచి అలా చూస్తూనే ఉంది వందన.

కళ్ళ నుండి నీరు ఏకధాటిగా కారుతూనే ఉంది చాలాసేపు అలాగే కూర్చుంది. అందరూ తననే వింతగా చూస్తున్నారని గమనించి, తనని తాను కంట్రోల్ చేసుకుంది వందన.

విశాఖపట్నం వెళ్లడానికి ఇంకా మూడు గంటల సమయం ఉంది. ఏది ఏమైనా ఈ రోజు తనకి జీవితంలో ఒక మంచి మరిచిపోలేని రోజు. ఎందుకంటే? ఇన్నాళ్ళకి తన ప్రియనేస్తాన్ని కలుసుకున్న రోజు మరిచిపోగలదా? అలా అనుకుంటూ మెల్లగా నిద్రలోకి జారుకుంది. ఇన్నాళ్లు తన జీవితంలో ఏదో కోల్పోయాను అన్న ఫీలింగ్ ఇప్పుడు లేదు వందనకి. తన మనసు ఇప్పుడు ఎంతో ప్రశాంతంగా అనిపించింది.

స్నేహంలో ఉండే మాధుర్యం అనుభవించే వాళ్లకే తెలుస్తుంది ■

## అక్టోబర్ నెల గళ్ళనుడికట్టు జవాబులు



# వధూ వరుల అన్వేషణ వేదిక

SAKHA:. Vaidika Telaganya
NAME:. Venkata Rama Praveen
INTIPERU:. Mangalampalli
GOTHRAM:. Haritasa
STAR:. Makha
DOB:. 12-12-1987
POB:. Chirala,Prakasam dist
TOB:. 9.40am
HEIGHT:. 5'11"
COLOUR:. Chamanachaya
EDU:. PDGM-Block chain,MBA- Marketing, BE(Bio medical),MBA(Marketing))



JOB: VP (Product )
ASVA Labs
HABITS:. No smoking,no drinking
SALARY: 65 LPA
PARENTS:. Father: Laxmi Narasimha Murthy Mangalampalli, Vice president,Indus Projects India Ltd.
Mother: Uma Saroja Vishnuvajhala, Home maker
SIBLINGS:. One sister(not married) medical Doctor working as a medical lead in Bioquest
REQUIREMENTS:. Soft spoken,soft nature,happy go lucky.
CONTACT:. M: 9920220264,F: 9987344980

---


SAKA: Telanganya
NAME: Divya
INTIPERU: Mangalampalli
GOTHRAM: Haritasa
STAR: Makha
DOB: 05/10/1991
POB: Vashi
TOB: 7:03 a.m.
HEIGHT: 5'2"
COLOUR: Wheatish
EDU: MBBS, PGPDSBA (Great Lakes), PGCTLI (MIT)



JOB: Healthcare Lead-Ideation and Strategy, BioQuest, Bangalore_
HABITS: NA
SALARY: 16 LPA
PARENTS: Father: Murthy Mangalampalli, Vice President- Indus projects Pvt Ltd
Mother: Uma Saroja Vishnuvajhala, Housewife, Art of Living teacher
SIBLINGS: Elder brother
REQUIREMENTS: Bangalore based groom without addictions_
CONTACT: M: 9920220264, F: 9987344980

---

NAME:. M yashashvi
INTIPERU:. Maddulapalli
SAKA:. Vidika telaganya
GOTHRAM:. Koundinyasa
STAR:. Jyeshtha
DOB:. 14/12/2001
POB:. Macherla
TOB:. 10:05am
HEIGHT:. 5'6
COLOUR:. Fair
EDU:. B HMS (homeo doctor)
JOB:. Duty doctor in Shamshabad
HABITS:. Listening music
SALARY:.
PARENTS:. Father: Late MVL Narasimha prasad Maddulapalli, Praivate school principal
Mother: Dp radha kumari Devarakonda, Home maker
SIBLINGS:. One younger brother(SWE, Unmarried)
REQUIREMENTS:. Saka
Pattimpu - No
Below 27 years, Software Job,
permenent source of income,
only vegetarian,
Well settled family,
Job location:Hyderabad
CONTACT:. M: 8328101580,F: 9948827030



## ఆధారాలు - అడ్డం

1) ఈమధ్య మంగళకరం అయిన ప్రయాణం

5) సుపుత్రా, ......!

9) అన్నీ కాదు

10) ఒక ముద్దుపేరు

12) చాలా పెద్దపాము

14) సొగసరి కోడలికి...?

15) పాముకు బద్ధశత్రువు

17) అర్థ భాగము

18) దేవతలు ఇక్కడుంటారట

20) 90 డిగ్రీలలో ఉండేది

22) మొసలి, అట్నుంచి

24) సీరియల్

27) ఎక్కువ

28) స్త్రీ, అక్షరాలు తడబడ్డాయి

30) పాముకు ఉండేవి, అక్షరాలు తడబడ్డాయి

31) కొందరు ఈ విరుపుడు మాటలు మాట్లాడతారు, అట్నుంచి

32) శీతాకాలంలో వచ్చే పండు

33) ఆడవారు

35) యావరేజ్

37) చీరకు పెట్టేది

38) మెరుపు

40) ఛెర్రీ సినిమా

41) పేరు, అట్నుంచి

43) వడుగు చేసుకునేవాడు, అక్షరాలు తడబడ్డాయి

44) పల్లెల్లో సమృద్ధిగా ఉండేది

45) ఈరోజు, అట్నుంచి

48) గుజరాతీలు ఎక్కువగా ఆడే ఆట

50) .. బనేగా కరోడ్‌పతి

52) ఉన్మాది

54) శిక్ష పడ్డ ముఖ్యమంత్రి

57) మొదటి నాలుగు హల్లులు

60) వాడ్ని ఇటు ..!

61) చిన్నతనము
63) భార్యాపుత్రులు, అట్నుంచి
67) ఇది పెట్టేస్తే ఆఫీసుకి వెళ్ళక్కర్లేదు
68) మాట, అట్నుంచి
71) ఇది కుడితే చాలా బాధ
61) .. మొన మోపినంత భూమికూడా ఇవ్వడట
73) ఒక పప్పుధాన్యము
74) అంగారకుడిమీద దీనికోసం
వెదుకుతారట, అట్నుంచి
77) మంగళయాన్‌కి అయిన ఖర్చును ఈ సినిమా ఖర్చుతో పోలుస్తున్నారు.
79) .., తుమీ తేల్చుకుంటారట
81) అన్నానా, ... ఎపుడైనా?
83) ముద్దు, అట్నుంచి
84) యముడు ఇది వేస్తాడట
86) ధరణికి గిరి భారమా.. ఈ పాట ఎవరు పాడారో తెలుసా?
89) పేరుని సూచించేది
91) పోట్లాట
92) భభ మమ, తర్వాత ?
93) కేళి
94) పుణ్యంకొద్దీ పురుషుడైతే, మరి బిడ్డలు?
96) కొందరు ఈ టోపీ పెడుతుంటారు, అట్నుంచి
98) చక్రాలు
99) నడిచేదారుల గమ్యమొక్కటే, మరి నడిపేవానికి?


## ఆధారాలు - నిలువు

1) ఉందిలే .... ముందు ముందునా
2) మెత్తన కాదు
3) కొత్త దూరదర్శన్ తెలుగు ఛానెల్
4) ఒక భారీ పండు
5) కోతి లాంటిదే
6) పచ్చటి బట్టలు
7) ...... పానము చేసి రంజిల్లవే
8) కాకి, అట్నుంచి
9) ఇది వింతగా వుంటుందట
13) .. జపం
16) అంతా
19) ఒక జాజి రకం
21) కీళ్ళలో ఒక రకం
23) నీది, నాది అంటే
25) ఈవిడ అమెరికా ప్రెసిడెంట్ అవుతుందని అనుకుంటున్నారు
26) చెడు వాసన
29) తీగ
32) రెంటికీ చెడ్డ...
34) ఇన్ని వర్షాలు పడుతున్నా ఇవి తప్పట్లేదు
36) ఆదాయం
37) ఇంత ఆశ పెట్టుకుంటారట!
39) మాట వినేవాడు
40) గోవు
42) పుల్లటి పండు
46) కన్ను
47) కోపం వచ్చినప్పుడు, 'నీతో ..', అంటారు పిల్లలు
49) బండి, అట్నుంచి
51) దశరథుడి పెద్దభార్య
52) ఇది చూపించటం అంటే పరిగెత్తటం
53) వర్షాలు
55) చామంతి లాంటి పువ్వు, అట్నుంచి
56) భాషకు ఉండవలిసింది
58) ఘల్లుఘల్లుఘల్లుఘల్లు ...సంగీతం
59) బంగారానికి కొలమానం
62) మరీ తిన్నగా
64) అశ్వము
65) రిజర్వ్‌బ్యాంక్ గవర్నర్
66) కైలాసమెత్తే తన్నిపంపించినవాడు
67) వేడి
69) ప్రతివాది కానివాడు
70) రుద్ది
71) కథలన్నీ చేరే చోటు
73) '...... పాపం', దసరానాడు జమ్మిచెట్టు చుట్టూ తిరుగుతూ చదివే పద్యం
75) ఆవు
76) చేతినిండా ఇది వుండాలి ఎవరికైనా
77) కిలోలో వెయ్యో వంతు
78) సూర్యుడు, అట్నుంచి
79) నైవేద్యం పెట్టేటప్పుడు ఇలా మొదలెడతారు 'ఓం.... స్వాహా'
80) కొందరు ఈ పాటలు బాగా పాడతారు
82) ఒక మండే పదార్థం
85) ఏడు రోజులు, అక్షరాలు తడబడ్డాయి
86) తామర పువ్వు, అక్షరాలు తడబడ్డాయి
87) ఒక కీటకము
88) మన ప్రధాని
90) గాంధీ గారు ఇది తిప్పేవారు
91) ఆఫీసు టైములో రోడ్లు .. గా వుంటాయి
93) పిల్లల్ని చూసుకునే ఆవిడ
94) తినడానికి ఉపయోగించే అంగం
96) బురద, అట్నుంచి
97) శునకము


జర్మనీ ఛాన్సలర్ తో
ప్రధాని మోది


విజయవాడలో
అద్భుతమైన
డ్రోన్ ప్రదర్శన

RNI No. TELTEL/2011/39497 NOVEMBER 2024 POSTAL NO. HSE/1043/2017-19
Date of Publication:1st November Date of Posting:8th November




Published, Edited and Printed by T Shanti at Flat No. 504, Tower A06, Rajiv Sahabhavana Nagole-Bandlaguda, Hyderabad-500068. Phone 9490571297 email: teega51@gmail.com , www.chaitanyam.net, Printed at Planographers, 5-8-300, Chirag Ali Lane, Abids, Hyderabad-500001.